ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 16 మార్చి 2025 | 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:22 (ఆదివారం సాయంత్రం)
సహర్: 4:49 (సోమవారం ఉదయం)

ఇక్కడా.. విదేశీ బ్రాండ్లు



కాకినాడ, రాజమహేంద్రవరంలో రెండు స్టోర్లు

- త్వరలో వాక్ ఇన్ మద్యం స్టోర్లు
- ఒక్కో దుకాణానికి రూ.కోటి ఫీజు
- ఏటా 10 శాతం లైసెన్స్ ఫీజు పెంపు
- దక్కించుకున్న ఇద్దరు వ్యాపారులు
- ఐదేళ్ల కాలపరిమితితో మంజూరు
- ఫారిన్ బ్రాండ్ల విక్రయానికి ఓకే
- గత వైసీపీలో పదికిపైగా షాపులు

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

మందుబాబులకు ఇష్టమైన బ్రాండ్లు దొరికితే తెగ తాగేస్తారు.. అదే ఫారెన్ బ్రాండ్లు అంటే మరీ మోజు.. కానీ మన దగ్గర ఫారెన్ బ్రాండ్లు దొరకడం అసాధ్యం.. ఇప్పుడు ఫారెన్ బ్రాండ్లన్నీ ఉమ్మడితూర్పుగోదావరి జిల్లాలోనే దొరకనున్నాయి. మెట్రోపాలిటిన్ సిటీల్లో అందుబాటులో ఉండే బ్రాండ్‌లు సైతం లోకల్‌గానే దొరికేస్తాయండోయ్.. అవునండి బాబూ నిజమే. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో రెండుచోట్ల రెండు వాక్ ఇన్ మద్యం స్టోర్లకు అనుమతిచ్చింది. వీటికి టెండర్లు పిలవగా ఇద్దరు వ్యాపారులు ఈ రెండు స్టోర్లను దక్కించుకున్నారు.. ఒక్కో స్టోర్‌కు ఏడాదికి లైసెన్స్ ఫీజు ఎంతో తెలుసా.. అక్షరాలా రూ.కోటి.. ఐదేళ్లపాటు లైసెన్స్ లభిస్తుండడంతో వీటిని ఎగరేసుకుపోయారు.. స్టోర్ దక్కించుకున్న వ్యాపారులు ఏటా లైసెన్స్ ఫీజుపై 10 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.. వీటికున్న డిమాండ్‌తో స్టోర్లను సదరు వ్యాపారులు ఎగరేసుకుపోయారు. కాకినాడ మెయిన్‌రోడ్డులో రాబోతున్న ఈ స్టోర్‌ను విజయవాడకు చెందిన ఓ వ్యాపారి.. రాజమహేంద్రవరంలోని ఏవీ అప్పారావు రోడ్డులో రాబోతున్న స్టోర్‌ను స్థానిక వ్యాపారి పోటీలో దక్కించుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ లైసెన్సు జారీ చేసింది. 45 రోజుల్లో ఇవి తెరుచుకోనున్నాయి. సాధారణ ప్రైవేటు మద్యం దుకాణంలో దొరికే అన్ని రకాల బ్రాండ్లతోపాటు విదేశీ సరుకు వీటిలో లభ్యం కావడం ప్రత్యేకత. వివిధ దేశాలకు చెందిన ప్రముఖ వైన్, విస్కీ బ్రాండ్లతోపాటు షాంపైన్ కూడా వీటిలో విక్రయించనున్నారు. చెప్పాలంటే ఫారెన్ బ్రాండ్లన్నీ దాదాపు వీటిలో దొరకనున్నాయి. ఏ విదేశీ బ్రాండ్ కావాలో సదరు వ్యాపారి లిక్కర్ డిపోకు ఆర్డరు ఇస్తే ఆ మందును స్టోర్‌లకు సరఫరా చేయనున్నారు. సాధారణ సూపర్ మార్కెట్ తరహాలో మద్యం ప్రియులు ఈ స్టోర్‌కు వెళ్లి సరుకులు కొనుగోలు చేసుకున్నట్టే వీటిని కొనుగోలు చేయవచ్చు. ఇదిలా ఉంటే గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పది వరకు వాక్ ఇన్ స్టోర్లను ఎక్సైజ్‌శాఖ నగరాలు, పట్టణాల్లో తెరిచింది. వీటిలో అప్పటి సర్కారు ఆదేశాలతో నాసిరకం మద్యం బ్రాండ్లను రెట్టింపు ధరకు విక్రయించి కొందరు ప్రభుత్వ పెద్దలు కోట్లలో సంపాదించారు. కానీ ఈ వాక్ ఇన్ స్టోర్లలో అన్ని ప్రముఖ కంపెనీలకు చెందిన విదేశీ బ్రాండ్లను విక్రయించనున్నారు. ఈ తరహా దుకాణాలకు రెండింటికే ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.




అమరావతికి పవన్..

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జనసేన 12వ ఆవిర్భావ సభకు విచ్చేసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం కాకినాడ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయలుదేరి అమరావతికి వెళ్లారు. ఉదయం 9.25 గంటలకు కాకినాడలో తాను బసచేసిన జీఆర్‌టీ గ్రాండ్ హోటల్ నుంచి బయటకు వచ్చారు. అక్కడ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అక్కడి నుంచి బయలుదేరి జిల్లా పోలీస్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. అక్కడ వేచి ఉన్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ బిందుమాధవ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలికి హెలీకాప్టర్ ఎక్కే వరకు ఉన్నారు. అనంతరం 9.45 గంటలకు హెలీకాప్టర్ అమరావతికి బయలుదేరింది. లక్షలాది మంది జనసేన కార్యకర్తలు, అభిమానుల రాకతో పార్టీ ఆవిర్భావ జయకేతనం సభ సూపర్ సక్సెస్ అవ్వడంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంతోషంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సభను విజయవంతం చేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



పవన్‌కల్యాణ్‌కు వీడ్కోలు పలుకుతున్న కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్

గాలి.. పోతోంది!



నాడు స్థానికంలో అప్రజాస్వామికం..

2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అప్రజాస్వామికంగా, దౌర్జన్యకరంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ప్రతిపక్ష పార్టీలను నామినేషన్లు వేయనివ్వని పరిస్థితి. దీంతో అన్ని మునిసిపాలిటీల్లోనూ వైసీపీనే విజయం సాధించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 12 మునిసిపాలిటీల్లో అప్పట్లో వైసీపీకి 319 మంది కౌన్సిలర్లు, టీడీపీకి 50, జనసేనకు 18, బీజేపీకి 8, కాంగ్రెస్ తరపున ఒక కౌన్సిలర్ ఎన్నికయ్యారు. ఇప్పటికే చాలామంది పార్టీ మారిన సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం, కాకినాడ కార్పొరేషన్లకు వైసీపీ ఎన్నికలు నిర్వహించడానికి భయపడిన సంగతి తెలిసిందే. ఎందుకంటే అప్పటికే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. మరోవైపు రెండు కార్పొరేషన్లు టీడీపీ కంచుకోటలు కావడంతో ఎన్నికల దిశగా ఆలోచించడమే మానుకుంది. ఐదేళ్లూ ఎన్నికలు నిర్వహించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు ప్రభుత్వం కార్పొరేషన్లకు జూన్‌లో ఎన్నికలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. వాటితోపాటు మొత్తం మునిసిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారా లేదా అనేది ఇంకా స్పష్టత కావలసి ఉంది. 2021 ఫిబ్రవరి 9 నుంచి 21వ తేదీ వరకూ పంచాయతీ ఎన్నికలు 4 దశల్లో జరిగాయి. ఆ ఎన్నికల్లో వైసీపీకి 805 సర్పంచ్ పదవులు రాగా, టీడీపీ, మిత్రపక్షాలకు 143 లభించాయి. అందులో ఇప్పటికే చాలామంది కూటమిలో చేరిన సంగతి తెలిసిందే. జడ్పీ ఎన్నికలు వాస్తవానికి 2020లో మార్చిలో జరగాలి. కరోనా వల్ల వాయిదా పడ్డాయి. 2021 ఏప్రిల్ 8వ తేదీన ఎన్నికలు నిర్వహించగా 2021 సెప్టెంబరు 19న ఫలితాలు ప్రకటించారు. వచ్చే సెప్టెంబరుకు నాలుగేళ్లు పూర్తవుతుంది. ఇప్పటికే చాలామంది జడ్పీటీసీలు కూటమిలో చేరగా కొందరు జడ్పీటీసీలు సైలెంట్ అయ్యారు. కొద్దిరోజుల్లో స్థానికంగా ఇంకా మార్పులు రానున్నాయి.

కూటమి వైపు వైసీపీ నేతల చూపు

- ఫ్యాన్స్.. పక్కచూపులు
- ఖాళీ అవుతున్న వైసీపీ
- ఇప్పటికే తుని టీడీపీ కైవశం
- జనసేనలో నిడదవోలు చైర్మన్
- సైలెంట్‌గా కొవ్వూరు చైర్‌పర్సన్
- మిగిలిన పురాలదీ అదే పరిస్థితి
- జడ్పీటీసీలు..సర్పంచ్‌ల క్యూ
- జూన్‌లో కార్పొరేషన్ ఎన్నికలు
- స్థానిక పట్టునకు ప్రయత్నాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఫ్యాన్ 'గాలి' పోతోంది.. ఎటువైపు వీలుంటే అటువైపు పోతోంది.. అధికారం ఉన్నప్పుడు విర్రవీగిపోయిన వైసీపీ గణం.. అధికారం పోవడంతో నెమ్మదిగా సర్దుకుంటోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు కొవ్వూరు డివిజన్‌లోనూ కూటమి పార్టీలు క్లీన్ స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం వైసీపీ ఊసే వినిపించలేదు. దీంతో ఆ పార్టీ నేతలతోపాటు, కార్యకర్తలు రోజురోజుకు దిగజారుతున్న పార్టీ పరిస్థితి చూసి మెల్లగా జారుకుంటున్నారు. గాలివీయని పార్టీలో ఇక ఎందుకు ఉక్కబోత తప్ప అని కూటమి వైపు అడుగులు వేస్తున్నారు. ప్రధానంగా స్థానిక సంస్థలైన పంచాయతీలు, మునిసిపాలిటీలు, జడ్పీలో ఉన్న వైసీపీ ప్రతినిధులు నెమ్మదిగా జారుకుంటున్నారు. వివిధ కారణాలతో ఆదిలోనే కొవ్వూరుకు చెందిన రాజీవ్‌కృష్ణ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మరికొందరు అదే బాటలో ఉన్నారు. వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ముందుగానే తప్పుకోవడం మంచిదనే నిర్ణయానికి వస్తున్నారు. కాకినాడ జిల్లాలోని తుని మునిసిపాలిటీయే అందుకు ఉదాహరణ. టీడీపీకి అక్కడ ఒక్క సీటు లేకపోయినా వైసీపీ కౌన్సిలర్లంతా టీడీపీలో చేరిపోయారు. దీంతో తుని మునిసిపాలిటీ టీడీపీ ఖాతాలో పడింది. అభివృద్ధి కార్యక్రమాలతోపాటు తమ రాజకీయ భవిష్యత్తు కోసం వారంతా ఇటు పయనించారని ఎవరికైనా అర్థమవుతుంది. అదే పరిస్థితి నిడదవోలులోనూ పునరావృత్తం కానున్నట్టు సమాచారం. ఇప్పటికే అక్కడ చైర్మన్ జనసేనతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారు. పదిమంది కౌన్సిలర్లతో వెళ్లి మంత్రి దుర్గేష్ సమక్షంలో జనసేన కండువా కప్పుకున్నారు. వచ్చే కౌన్సిల్ సమావేశంలో నిడదవోలు జనసేన వశమయ్యే అవకాశాలున్నట్టు సమాచారం. ఇక కొవ్వూరులోనూ ఇలాగే ఉంది. చైర్మన్ ఇప్పటికే గౌరవం లభించడంలేదని పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. కేవలం మునిసిపల్ కార్యక్రమాలకే హాజరవుతున్నారు. కొవ్వూరులో ఇదే పరిస్థితి నెలకొన్నట్టు తాజా సమాచారం. కొవ్వూరులో ఇప్పటికే ఏడుగురు టీడీపీ కౌన్సిలర్లు ఉండగా మరో 8 మంది వెళితే కొవ్వూరు టీడీపీ వశమవుతోంది. దీంతో పలువురు 'ఫ్యాన్' కౌన్సిలర్లు టీడీపీ వైపు చూస్తున్నట్టు తెలిసింది.

కూటమికి కలిసొచ్చే కాలం..

వచ్చే ఏడాది వరకూ స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు ఉంది. కానీ నాలుగేళ్లు పూర్తయిన తర్వాత మునిసిపల్ చైర్మన్లు, సర్పంచ్‌లు, జడ్పీ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు పెట్టే అవ కాశం ఉండడం కూడా కూటమికి కలిసొచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే సర్పంచ్ పాలకవర్గాలకు నాలుగేళ్లు నిండాయి. మార్చి నెలతో మునిసిపల్ పాలకవర్గాలకు నాలుగేళ్లు నిండిపోతాయి. సెప్టెంబరులో జడ్పీలకు నాలుగేళ్లు నిండిపోతాయి. అధికారంలో ఉన్న పార్టీలకు స్థానికంగా బలం ఉంటుంది కాబట్టి స్థానిక ప్రజాప్రతినిధులంతా అటువైపే మొగ్గు చూపడం సహజం. దీంతో వైసీపీలో భారీగా వలసలు తథ్యం.

నేడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- జిరాక్సు సెంటర్లను మూసివేయాలి
- జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలు
- ఏర్పాటు : డీఆర్వో రాజకుమారి

అమలాపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. డీఆర్వో మాట్లాడుతూ ఏపీపీఎస్‌ఈ నిర్వహిస్తున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి పరీక్షలకు జిల్లాలో 330 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. కాట్రేనికోన మండలం చెయ్యేరులోని శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాల, భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. అభ్యర్థులు ఉదయం 8 గంటల నుంచి 8.45 గంటలోపు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. 9 గంటల తరువాత ఎవరినీ కూడా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరని స్పష్టంచేశారు. పరీక్ష మొదలయ్యాక పూర్తి అయ్యేవరకు అభ్యర్థులు ఎవరినీ బయటకు పంపించరని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లను అనుమతించమన్నారు. పరీక్షా కేంద్రాల్లోని ఇన్విజిలేటర్లు, పోలీసులు, హెల్త్ అసిస్టెంట్ల వద్ద కూడా మొబైల్ ఫోన్లు ఉండరాదన్నారు. శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలకు ముమ్మిడివరం డిప్యూటీ తహశీల్దార్‌ను, బీవీసీ కళాశాలకు అల్లవరం డిప్యూటీ తహశీల్దార్లను కోఆర్డినేటింగ్ ఆఫీసర్లుగా నియమించామన్నారు. పరీక్షల నిర్వహణలో వారు పూర్తి బాధ్యత వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయాలని, సమీపంలోని జిరాక్సు సెంటర్లను మూసివేసేలా చర్యలు చేపట్టాలన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఆర్డీవో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్‌ఎం.దుర్గారావుదొర, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు, ఏపీపీఎస్‌ఈ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పి.నందగోపాల్, డిప్యూటీ తహశీల్దార్లు గోపాలకృష్ణ, అడపా సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 584 మంది గైర్హాజరు

అమలాపురం టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఎక్కడా మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. కాగా 584 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. కొత్తపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సిద్ధార్థ జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను డీఐఈవో సోమశేఖరరావు సందర్శించారు. అదేవిధంగా రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, మూడు సిటింగ్ స్క్వాడ్‌లు, కస్టోడియన్లు, జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జనరల్ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 9927 మందికి 2617 మంది హాజరుకాగా 310 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ ఇంటర్మీడియట్ విభాగంలో 1891 మంది విద్యార్థులకుగాను 1617 మంది హాజరుకాగా 274 మంది గైర్హాజరయ్యారు. రసాయనశాస్త్రం, వాణిజ్యశాస్త్రం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం!

స్వచ్ఛాంధ్రలో జిల్లా ఇన్‌చార్జి అధికారి పి.రవిసుభాష్ పిలుపు



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌చార్జి అధికారి రవిసుభాష్, జేసీ నిషాంతి

అమలాపురం, మార్చి15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని నివారించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని జిల్లా ఇన్‌చార్జి అధికారి పి.రవిసుభాష్ పిలుపునిచ్చారు. ఒకసారి వాడి పారవేసే ప్లాస్టిక్ సంచులకు బదులుగా జ్యూట్, క్లాత్, పేపరు బ్యాగులను వినియోగించాలని పిలుపునిచ్చారు. అమలాపురం రైతు బజార్‌లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రవిసుభాష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకసారి వాడి పారవేసే ప్లాస్టిక్ వస్తువుల తయారీ, దిగుమతి, నిల్వ, పంపిణీ, అమ్మకం, వాడకంపై నిషేధం విధించిందన్నారు. వాటికి బదులుగా జ్యూట్ బాగులను వినియోగించాలన్నారు. ప్లాస్టిక్‌కు బదులుగా ప్రత్యామ్నాయ వస్తువులను ఉపయోగించేవిధంగా జిల్లా యంత్రాంగం ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు సైతం తమ కార్యాలయాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకుని ప్రకృతి సంపదను పరిరక్షించాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఊరు బాగుంటుందన్నారు. ఊరు బాగుంటే జిల్లా బాగుంటుందని, జిల్లా బాగుంటే రాష్ట్రమే బాగుంటుందన్నారు. పరిశుభ్రమైన పచ్చదనంతో నిండిన జిల్లాగా కోనసీమను తీర్చిదిద్దేందుకు అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం డ్వాక్రా సంఘాల మహిళలు తయారుచేసిన జూట్ బ్యాగులను ఉన్నతాధికారులు పరిశీలించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించండి అనే థీమ్‌తో చేపట్టిన ర్యాలీని రవిసుభాష్‌ను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్, మార్కెటింగ్‌శాఖ ఏడీ విశాలాక్షి, అడ్డాల గోపాలకృష్ణ, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, డాక్టర్ పీఎస్ శర్మ, నల్లా చిట్టిబాబు పాల్గొన్నారు. క్లబ్ చైర్మన్ బోనం సత్యవరప్రసాద్ సంచులను పంపిణీ చేశారు.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు సమన్వయంతో పనిచేయాలి

వివిధ శాఖల్లో అమలవుతున్న కార్యక్రమాలపై జిల్లా ఇన్‌చార్జి అధికారి సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి అధికారి రవిసుభాష్, జేసీ

అమలాపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనకు ఇప్పటినుంచే అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి అధికారి పి.రవిసుభాష్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో శనివారం జిల్లాలోని వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న కార్యక్రమాల అమలు తీరుపై ఆయన సమీక్షించారు. తొలుత జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా ప్రొఫైల్‌ను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయనకు వివరించారు. అనంతరం ఇన్‌చార్జి అధికారి రవిసుభాష్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా లక్ష్యాలను సాధించేలా ముఖ్యమైన పనితీరు సూచికలపై దృష్టి పెట్టాలన్నారు. వ్యవసాయశాఖ 21 శాతం వృద్ధి రేటును సాధించాలన్నారు. దీనిలో భాగంగా సాగునీటిని ముందస్తుగా విడుదల చేయడం, నాణ్యమైన విత్తనాలు అందించడం, ప్రణాళికాబద్ధంగా ఎరువులను ఉపయోగించడం, మురుగుకాల్వలను శుభ్రం చేయడం వంటి వాటిపై దృష్టిసారించాలన్నారు. ఈ ఏడాది 21 శాతం వృద్ధి రేటు సాధించేందుకు ప్రతీ నెలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల షెడ్ల నిర్మాణంలో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన గ్రామీణ్, అర్బన్ పథకం కింద ఏర్పాటుచేసిన లేఅవుట్లలో ఉపాధి హామీ పథకం కింద రోడ్లు వేసే అంశంపై దృష్టి సారించాలన్నారు. జలజీవన్ మిషన్ కింద ప్రతీ ఇంటికీ కుళాయిల ద్వారా నీటిని అందించాలన్నారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలను సాధించే దిశగా అందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేలా కృషిచేయాలన్నారు. సమావేశంలో జేసీ టి.నిషాంతి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, సీపీవో వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్, టీకేవీపీ ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ రామకృష్ణారెడ్డి, కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీవోలు శ్రీకర్, డి.అఖిల పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతీరోజు కొంత సమయం కేటాయిస్తామని కలెక్టరేట్ అధికారులు, సిబ్బందితో రవిసుభాష్, జేసీ ప్రతిజ్ఞ చేయించారు.

పది పరీక్షల ఏర్పాట్లు పూర్తి : డీఈవో

ముమ్మిడివరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షలకు సంబంధించి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. జిల్లాలోని 22 మండలాలకు సంబంధించి 19,217 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. వీరికి సంబంధించి 110 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గతంలో పది ఓపెన్ స్కూలు పరీక్షలు వేరేగా జరిగాయని ఈ ఏడాది అవి కూడా వీటితో పాటు నిర్వహిస్తారన్నారు. ఓపెన్ స్కూలుకు సంబంధించి 1,160 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా వారి కోసం 19 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఎటువంటి మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీసుకు తావు ఇవ్వకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లకు ఇప్పటికే పరీక్షల నిర్వహణకు సంబంధించి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో ఐదు మొబైల్ స్క్వాడ్‌లు ఏర్పాటుచేశామని, వీటిలో డిప్యూటీ తహశీల్దార్, ఎంఈవో, పోలీసు అధికారి సభ్యులుగా ఉంటారన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. పరీక్షలురాయడానికి బెంచీలు, విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు వంటివి ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు గంట ముందు పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని, పరీక్ష ప్రారంభమైన అరగంట వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించడం జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరైన విద్యార్థి 12.45 గంటల వరకు పరీక్షా కేంద్రంలో ఉండాలని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

పదిలో విజేతలుగా నిలిచేందుకు ఇలా చేయండి

అమలాపురం రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతున్నందున విద్యార్థులు తగిన నియమాలు పాటిస్తే విజేతలుగా నిలుస్తారని కామనగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు భాషోపాధ్యాయుడు మాకే బాలార్జున సత్యనారాయణ పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతీ మార్కు ముఖ్యమైందని గుర్తించాలి. జవాబు పత్రాలు మూల్యాంకనం చేసే వారిని ఆకట్టుకునేవిధంగా సమాధానాలు అందంగా రాయాలి. అందమైన రాత కంటే అక్షరాలు స్పష్టంగా అర్థమయ్యేలా ఉండాలి. అన్ని పరీక్షలు ముగిసే వరకు టీవీ, సెల్‌ఫోన్ల జోలికి వెళ్లవద్దు. ఒత్తిడి, ఆందోళన దరి చేరకుండా పరీక్షలు రోజువిడిచి రోజు నిర్వహించడం విద్యార్థులకు కలిసివచ్చే సానుకూల అంశం. నేను రాయగలను. నేను విజయం సాధించగలను అనే సానుకూల దృక్పథం, ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరు కావాలి. వేసవి తీవ్రత దృష్ట్యా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సౌకర్యవంతమైన దుస్తులు ధరించాలి. పరీక్షా సమయం 3 గంటల 15 నిమిషాలు ఉన్నందున ప్రశ్నాపత్రాన్ని చదువుకునేందుకు 15 నిమిషాల సమయం కేటాయించాలి. సైన్స్ మినహా అన్ని సబ్జెక్టులకు 24 పేజీల బుక్‌లెట్‌లోనే సమాధానాలు రాయల్సి ఉంటుంది. కొట్టివేతలు, దిద్దివేతలు లేకుండా ఆకర్షణీయంగా జవాబులు రాయాలని ఆయన సూచించారు.

మీరూ అవుతారా.. సైంటిస్ట్!



- జిజ్ఞాసను, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు 'ఇస్రో' యంగ్ సైంటిస్ట్స్ కార్యక్రమం
- 9వ తరగతి విద్యార్థులకు చక్కటి అవకాశం
- రిజిస్ట్రేషన్‌కు ఈనెల 23వ తేదీ వరకు గడువు
- అంతరిక్ష పరిశోధనలపై ఏడు కేంద్రాల్లో శిక్షణ



ఇస్రో అంతరిక్ష ప్రయోగాలు (ఫైల్‌ఫొటో).. అంతరిక్ష జిజ్ఞాస పోస్టర్ (కింద)

సైన్స్ పట్ల ఎన్నో ఆలోచనలు.. అందుకే ఇస్రో కార్యక్రమం

హైస్కూల్ స్థాయిలో పిల్లలను పెద్దయ్యాక ఏమవుతావ్ అంటే.. ఎక్కువ మంది పిల్లలు సైంటిస్ట్ అవుతానని చెబుతారు. ఎందుకంటే వారికి అప్పుడే సైన్స్ సంబంధ విషయాలపై బోధన జరుగుతూ ఉంటుంది. దాంతో సహజంగానే వారికి తెలుసుకోవాలన్న ఆసక్తి పెరుగుతుంది. శూన్యంగా కనిపిస్తున్న అంతరిక్షంలో ఎన్నో వింతలు ఉన్నాయి. అసలు అంతరిక్షంలో ఏం జరుగుతుంది.. అంతరిక్షంలోకి పంపించిన రాకెట్లు, శాటిలైట్ల ద్వారా శాస్త్రవేత్తలు ఏమి తెలుసుకుంటున్నారు అన్న ఆసక్తి విద్యార్థుల మెదడును తొలుస్తూ ఉంటుంది. అందులోనూ అంతరిక్షంపై ఆసక్తి ఉన్నవారికి మరీ ఎక్కువ. అటువంటి విద్యార్థుల కోసం 'యువికా' ఆధ్వర్యంలో అంతరిక్ష విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకునేందుకు అవకాశం కల్పించింది. అంతరిక్ష పరిశోధనలపై ప్రాథమిక పరిజ్ఞానం కల్పించేందుకు యువికా-2025 (యంగ్ సైంటిస్ట్) కార్యక్రమాన్ని భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) రూపొందించింది. 2024-25 సంవత్సరంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనా కేంద్రాల పర్యటనకు అవకాశం కల్పించారు. ఈనెల 23వ తేదీలోగా విద్యార్థులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

బాల శాస్త్రవేత్తల కోసం...

పాఠశాల స్థాయిలో సైన్స్‌పై ఆసక్తి కలిగిన విద్యార్థులు ఎందరో ఉన్నారు. వారు తమ సృజనాత్మకతకు పదునుపెడుతూ నూతన ఆవిష్కరణలు చేపడుతున్నారు. రూపొందించిన పలు ప్రాజెక్టులతో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ ప్రశంసలు అందుకుంటున్నారు. అటువంటి ప్రతిభావంతులను భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా)ను అంతరిక్ష పరిశోధనా సంస్థల సందర్శనను ఇస్రో చేపట్టింది.



శిక్షణకు ఏడు కేంద్రాలు ఎంపిక..

అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేందుకు ఏడు కేంద్రాలను ఎంపిక చేశారు. తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, బెంగళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్, హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్ సెంటర్, ఐఐఆర్ఎస్ డెహ్రాడూన్, శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో తొలి విడతగా ఏప్రిల్ 7న మొదటి జాబితా విడుదల చేస్తారు. యువికాకు ఎంపికైన విద్యార్థులు మే 18న రిపోర్టు చేయాల్సి ఉంటుంది. మే 19 నుంచి 30వ తేదీ వరకు వారికి నిర్దేశించిన కేంద్రాల్లో అంతరిక్ష పరిశోధనలు, ఇతర అంశాలపై శిక్షణ ఇస్తారు.



ప్రతిభావంతులకు ఆన్‌లైన్ క్విజ్

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు యువికాకు అర్హులు. ఈ-మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు 48గంటల్లో ఇస్రో ఆన్‌లైన్ క్విజ్ నిర్వహిస్తుంది. క్విజ్ పూర్తి అయిన తర్వాత యువికా పోర్టల్‌లో ఓ విద్యార్థి పూర్తి వివరాలు నమోదు చేయాలి. విద్యార్థి సాధించిన ప్రగతికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలను జతపరచాలి. క్రీడలు, స్కౌట్ అండ్ గైడ్, ఎన్‌సీసీ, గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్నవారికి ప్రత్యేక మార్కులు కేటాయిస్తారు. ఎంపికైన విద్యార్థులకు భోజన, వసతి రవాణా ఖర్చులను ఇస్రోయే భరిస్తుంది. ఎంపికైన విద్యార్థితోపాటు తల్లిదండ్రుల్లో ఒకరు లేదా గైడ్ టీచర్‌కు కూడా ప్రయాణ ఖర్చులు చెల్లిస్తారు. శిక్షణ అనంతరం శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రానికి తీసుకువెళ్లి అక్కడి విశేషాలను విద్యార్థులకు వివరిస్తారు.



భవిష్యత్తు శాస్త్రవేత్తలకు చక్కని అవకాశం

ఇస్రో ఆధ్వర్యంలో చేపట్టిన యువ విజ్ఞాన కార్యక్రమం విద్యార్థులను భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు చక్కని అవకాశం కల్పిస్తోంది. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకునేలా సైన్స్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. పాఠశాల స్థాయి నుంచే శాస్త్ర ప్రయోగాలతో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన బాలశాస్త్రవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- గిరిజాల వెంకటసత్యసుబ్రహ్మణ్యం, కోనసీమ జిల్లా సైన్స్ అధికారి

- అమలాపురం రూరల్



జ్యోతిప్రజ్వలన చేసి టెక్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న జేఎన్టీయూకే వీసీ ప్రసాద్, అతిథులు

టెక్ ఫెస్ట్‌లతో సాంకేతిక విజ్ఞానాన్ని మెరుగుపర్చుకోవాలి

- రిలయన్స్ ఇండస్ట్రీస్ ఉపాధ్యక్షుడు వేణుగోపాలరాజు
- కాకినాడ జేఎన్టీయూలో జాతీయ స్థాయి సింపోజియం ప్రారంభం

జేఎన్టీయూకే, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): టెక్ ఫెస్ట్‌ల ద్వారా విద్యార్థులు సాంకేతిక విజ్ఞానాన్ని మెరుగుపర్చుకోవాలని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆయిల్, గ్యాస్ విభాగం ఇంజనీరింగ్ సర్వీసెస్ ఉపాధ్యక్షుడు వి.వేణుగోపాలరాజు పేర్కొన్నారు. వర్సిటీలోని యూసీఈకే ఈఈఈ, మెకానికల్, ఈసీఈ, సీఎస్ఈ, పీఈ, సీఈ విభాగాలు జాతీయ స్థాయి సింపోజియం టెక్ ఫెస్ట్‌ను రెండు రోజులు నిర్వహించనున్నాయి. వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో టెక్‌ఫెస్ట్ ప్రారంభోత్సవాన్ని ప్రిన్సిపాల్ మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా వేణుగోపాలరాజు, విశిష్ట అతిథిగా ఉప కులపతి సీఎస్ఆర్‌కే ప్రసాద్, అతిథులుగా రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఐదు విభాగాల సావనీర్లను, సీడీలను వారు ఆవిష్కరించారు. వేణుగోపాలరాజు మాట్లాడుతూ వినూత్న ఆవిష్కరణలు, సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు, స్టార్టప్‌లకు టెక్‌ఫెస్ట్‌లు వేదికగా నిలుస్తాయన్నారు. వైస్ చాన్సలర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో ఇండస్ట్రీ 5.0 విప్లవం నడుస్తోందని, ఇది పారిశ్రామీకరణ అభివృద్ధి చెందుతున్న దశ అని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రాజెక్టులు, పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. డైరెక్టర్లు, హెచ్‌వోడీలు, వైస్ ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



ఘాట్ రోడ్లలో ప్రమాదాల నివారణకు సంబంధించి రూపొందించిన ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

త్వరలోనే ప్రేక్షకుల ముందుకు

మెగాస్టార్ విశ్వంభర

'ఆంధ్రజ్యోతి'తో చిత్ర దర్శకుడు మల్లిడి వశిష్ట



అనపర్తి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న సోషల్ ఫాంటసీ మూవీ 'విశ్వంభర' త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతోందని చిత్ర దర్శకుడు మల్లిడి వశిష్ట వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరంలో సోమాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు శనివారం వచ్చిన ఆయన మల్లిడి సురేంద్రరెడ్డి నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా కొద్దిసేపు 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు. తన తొలి చిత్రం బింబిసార ప్రేక్షకులను ఆకట్టుకుందని, రెండో చిత్రం మెగాస్టార్ చిరంజీవితో చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సినిమా షూటింగ్ పూర్తి చేసుకుందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందన్నారు. బింబిసార పార్ట్-2 గురించి ప్రస్తావించగా... ఆ చిత్రాన్ని ఇప్పటికే వేరే నిర్మాతలు వేరే దర్శకుడితో తీస్తున్నట్టు ప్రకటించారని తెలిపారు. ఇండస్ట్రీకి హీరోగా వచ్చి తర్వాత దర్శకుడిగా ఎలా మారారని ప్రశ్నించగా... తనకు ముందు నుంచీ కథలపై మక్కువ ఎక్కువని, కొత్త తరహా కథలను తెరకెక్కించాలన్న తపనతో దర్శకుడిగా మారినట్టు చెప్పారు. సోమాలమ్మ తీర్థం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నివాసానికి వెళ్లి ఆయనతో కొద్దిసేపు ముచ్చటించారు. అక్కడి నుంచి వశిష్ట స్వగ్రామమైన బిక్కవోలు మండలం తొస్సిపూడి వెళ్లారు.



సోమాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న సినీ దర్శకుడు వశిష్ట

మా తాతయ్యది ధవళేశ్వరమే..

- హీరోయిన్ శ్రీలీల
- రాజమండ్రి నాకు సెంటిమెంట్: హీరో నితిన్
- రాబిన్‌హుడ్ చిత్రం యూనిట్ సందడి



హీరో నితిన్, హీరోయిన్ శ్రీలీల, దర్శకుడు వెంకీ

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి15(ఆంధ్రజ్యోతి): తనకు రాజమండ్రి బాగా పరిచయమున్న నగరమని, తన తాతయ్య ధవళేశ్వరంలో ఉండేవారని హీరోయిన్ శ్రీలీల చెప్పారు. వెంకీ కుడుముల దర్శకత్వంలో హీరో నితిన్, హీరోయిన్ శ్రీలీల నటించిన రాబిన్‌హుడ్ చిత్రం ఈ నెల 28న విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా ప్రమోషన్ కోసం చిత్రం యూనిట్ రాజమహేంద్రవరం వచ్చింది. శనివారం మంజీరా హోటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో శ్రీలీల మాట్లాడుతూ ఈ సినిమాలోని పాత్ర తనకెంతో నచ్చిందని, ప్రేక్షకులను బాగా అలరిస్తుందన్నారు. రాజమండ్రిలో రోజ్‌మిల్క్ తనకు చాలా ఇష్టమని చెప్తూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. హీరో నితిన్ మాట్లాడుతూ ఈ చిత్రంలో ప్రేక్షకులను ఆకట్టుకొనే అన్ని అంశాలూ ఉన్నాయని, అందరికీ భలేగా నచ్చేస్తుందన్నారు. గతంలో వెంకీ కుడుముల దర్శకత్వంలో తాను నటించిన భీష్మ చిత్రం మంచి విజయాన్ని సాధించిందని, ఆ సినిమాలో ఒక సన్నివేశం ఈ రాజమండ్రిలోనే చిత్రీకరించామని, దాంతో సినిమా హిట్టని, అదే సెంటిమెంట్‌తో రాబిన్‌హుడ్ సినిమాలో కూడా ఒక సీన్ ఇక్కడ చిత్రీకరించామని, సినిమా తప్పకుండా సూపర్ హిట్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ ఇప్పటికే రాబిన్‌హుడ్ టీజర్ సాంగ్స్‌కు మంచి స్పందన వస్తోందని, సినిమా తప్పకుండా హిట్ అవుతుందన్నారు.

గోవిందా..గోవిందా..

- వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
- స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.52.39 లక్షలు



స్వామి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



ఆత్రేయపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి పండితులు ఐశ్వర్య లక్ష్మీ హోమం, బాలభోగం నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భారీ లైన్లలో నిలుచుని స్వామివారిని దర్శించుకుని తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఓ భక్తురాలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను దేవస్థానానికి అందించడంతో తిరిగి ఆమెకు అందించారు. రాత్రి పశ్చిమ గోదావరి తణుకు శృతిలయ అకాడమీకి చెందిన కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.52.39 లక్షలు లభించినట్టు ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

డెల్టా కాలువలకు పెరిగిన నీటి విడుదల



ధవళేశ్వరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం కాటన్ బ్యారేజ్ నుంచి డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచారు. ఇప్పటి వరకు మూడు డెల్టా కాలువలకు 9850 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా శనివారం నుంచి 10,250క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టాకు 3050 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2050 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5200 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10.25 అడుగులుగా నమోదు కాగా పాండ్ లెవెల్ 13.79గా ఉంది.

వైభవంగా నరసన్న శ్రీ పుష్పయాగం



కోరుకొండ నరసింహస్వామి ఆలయ ముఖ మండపంలో శ్రీపుష్పయాగం

కోరుకొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో ఏడో రోజైన శనివారం రాత్రి స్వామికి శయనంద పర్యోత్సవం(శ్రీ పుష్పయాగం) వైభవంగా నిర్వహించారు. ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో స్వామికి విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం జరిపి అనంతరం పల్లకీలో ఆశీనులను చేసి ఆలయం చుట్టూ నృత్య, సంగీత వాయిద్య వంటి 12 రకాల ధ్వనులతో 12 ప్రదక్షిణలు నిర్వహించారు. తదుపరి స్వామికి 12రకాల ఆరాధనలు, 12రకాల నివేదనలు సమర్పించి శ్రీపుష్ప యాగాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త పరాశర రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు, కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆదాయం రూ.23,25,537

నరసింహస్వామి హుండీలను అన్నవరం దేవస్థానం అధికారులు, సిబ్బంది దేవస్థానం కల్యాణ మండపం వద్ద శనివారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.12,41,365 ఆదాయం వచ్చిందని అధికారులు డీటీ చంద్రశేఖర్, వాసు, రాంజీ తెలిపారు. అలాగే స్వామి వారి కల్యాణం ద్వారా రూ.2,10,924, దర్శనాల ద్వారా రూ.2,37,530, లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.4,06,700, లైసెన్సుల ద్వారా రూ.1,88,400, కట్నాలు రూ.40,618.... వెరసి రూ.23,25,537 ఆదాయం వచ్చినట్టు దేవస్థానం అధికారులు చెప్పారు.





కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు



అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు

అధికారుల తీరు మారదా?

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ సమావేశంలో ప్రజాప్రతినిధుల నిలదీత
- జిల్లా ఉన్నతాధికారుల గైర్హాజరు.. కాకినాడ కలెక్టర్ మాత్రమే హాజరు
- స్వచ్ఛ కార్యక్రమం కారణంగా హాజరుకాలేకపోయారని వివరణ
- సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక అధికారులు ఉక్కిరిబిక్కిరి
- రూ.1014 కోట్లతో జడ్పీ బడ్జెట్ ఆమోదం


కాకినాడలో జరిగిన జడ్పీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీలు, అధికారులు

కాకినాడ/కాకినాడ సిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అది నాలుగు జిల్లాలకు సంబంధించిన కీల క సమావేశం. అయినా అందులో రెండు జిల్లాల ఉన్నతాధికారులు హాజరుకాని వైనం.. ఇదే తీరు గత మూడు సమావేశాల నుంచి జరుగుతుండడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సమావేశంలో ఎక్స్అఫీషియో సభ్యులు భగ్గుమన్నారు. ఆయా జిల్లాల అధికారులే లేకపోవడంతో జడ్పీ సమావేశం ఏ హడావుడి లేకుండా సాదాసీదాగా సాగింది. రూ.1014 కోట్లతో జడ్పీ బడ్జెట్‌ను సభ్యులంతా కలిసి ఆమోదించారు. కాకినాడలోని జడ్పీ సమావేశమందిరంలో తూర్పుగోదావరి జిల్లా పరిషత్ బడ్జెట్, సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తప్ప ఆ స్థాయి కేడర్‌గల అధికారులు మి గిలిన జిల్లాల నుంచి హాజరుకాలేదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో ఉన్నత స్థాయి అధికారులెవరూ హాజరుకాలేదు. దీంతో సమావేశానికి హాజరైన ఎక్స్అఫీషియో సభ్యుల్లో ఒకరైన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తీవ్రంగా మండిపడ్డారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరరావు, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, కుడుపూడి సూర్యనారాయణ ప్రజా సమస్యలపై అధికారులను నిలదీశారు. దీనికి కాకి నాడ జిల్లా కలెక్టర్ కలుగజేసుకుని సర్దిచెప్పే ప్ర యత్నం చేశారు. తర్వాత సమావేశానికి అందరూ హాజరయ్యేలా సమన్వయం చేసుకుంటామన్నారు. 'స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివస్' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు బిజీ షెడ్యూల్ ఉండడంతో రాలేకపోయారని వివరణ ఇచ్చారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ కొన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు చెల్లించలేదని విద్యార్థుల హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నారని, దీనిపై సీరియస్‌గాస్పందించాలని కలెక్టర్‌ను కోరారు.

నీరు దారి మళ్లిస్తే కేసులు : కలెక్టర్ సీరియస్



పంటపొలాలకు నీళ్లు ఇచ్చే విషయమై తాళ్లరేవు జట్పీటీసీ దొమ్మేటి శామ్యూల్ మాట్లాడారు. దిగువనన పంటలకు సకాలంలో నీరు వదలడంలేదని అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై కాకినాడ కలెక్టర్ స్పందిస్తూ ఇరిగేషన్ కాలువలకు ఎగువనున్న కొందరు రైతులు, దిగువనున్న పొలాలకు నీళ్ల రానివ్వకుండా అడ్డుకట్టలు వేయడం సరైన విధానం కాదని మండిపడ్డారు. చదువుకున్న వాళ్లయ్యి ఉండి.. కనీసం ఇంకిత జ్ఞానం లేకుండా కొందరు ప్రవర్తిస్తున్నారు. వంతులవారీగా నీళ్ల ఇస్తున్నా కొందరు మోటార్లు పెట్టి లాగేస్తున్నారని, అందులో డాక్టర్లు, ఇంజినీర్లు వంటి వారు కూడా ఉన్నారని, ఆఖరికి ఇంజినీరింగ్ ఏఈని కూడా కాజులూరులో బెదిరించారని, ఈసారి ఎవరైనా అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు పెడతామని కలెక్టర్ తీవ్రంగా హెచ్చరించారు.

రెండో పంటకు నీటి విడుదలపై..

ఉమ్మడి జిల్లాలో రెండో పంటకు నీటిని విడుదల చేసే అంశాన్ని సమావేశంలో పలువురు జడ్పీటీసీలు లేవనెత్తగా ఇరిగేషన్ అధికారులు వివరణ ఇచ్చారు. శివారు ప్రాంత పొలాలకు నీటిని సరఫరా చేయాలని రాజోలు జడ్పీటీసీ మట్టా శైలజ కోరారు. రేషన్ బియ్యం నాసిరకం గా ఉంటున్నాయని చెప్పడంతో.. దానిపైనా విచారణ జరపాలని ఎమ్మెల్యే వేగుళ్ల, మరో జడ్పీటీసీ కలెక్టర్‌ను కోరారు. దీనిపై కాకినాడ కలెక్టర్ వివరణ ఇస్తూ కొత్త పంట కావడంతో అన్నం ముద్దగా అవుతుందని, బియ్యంలో పోషకాలు కలిపాకే ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందజేస్తామని బదులిచ్చారు.

జనరిక్ మందులపై అవగాహన కల్పించాలి

జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమాలను జిల్లాల్లో విస్తృతంగా నిర్వహించాలని, ఆరోగ్యంపై వ్యయాన్ని తగ్గించేందుకు ఏర్పాటుచేసిన జనరిక్ మందుల షాపులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ కోరారు. కారుణ్య నియామకాలను వేగవంతం చేయాలని, ఉద్యోగులకు జీపీఎఫ్ స్లిప్పులు జారీ చేయాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు కోరారు. గిరిజన ప్రాంత ప్రజా సమస్యలపై చర్చ, పరిష్కారానికి ఐటీడీఏ జనరల్ బాడీ సమావేశాలకు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఎమ్మెల్సీ అనంతర ఉదయ్ భాస్కర్‌తో పాటు, ఏఎస్ఆర్ జిల్లా పరిధి జడ్పీటీసీలు కోరగా.. ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం స్పందిస్తూ ఏప్రిల్ చివరి లేదా మే తొలివారంలో తదుపరి సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు. తమ జిల్లాలకు సంబంధించి సభ్యులు లేవనెత్తిన అంశాలపై చర్యలు చేపడతామని తూర్పుగోదావరి జిల్లా జేసీ ఎస్.చినరాముడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఆర్‌వో రాజకుమారి సభ్యులకు తెలిపారు. బడ్జెట్ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన సభ్యులు, అధికారులకు జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్లు బుర్రా అనుబాబు, మేరుగు పద్మలత, జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్, ఏవో ఎం.బుజ్జిబాబు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో కేటాయింపులు ఇలా...

2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.70 లక్షల మిగులుతో రూ.1014కోట్ల బడ్జెట్‌ను ఉమ్మడి తూ ర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ ఆమోదించింది. జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. సమావేశంలో 2024-25 సంవత్సరానికి సవరించిన బడ్జెట్‌ను, 2025-26 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను చర్చించి ఆ మోదించారు. 2024-25 సవరణ బడ్జెట్లో ఆదాయం రూ.846.60కోట్లు, వ్యయం రూ.845.95 కోట్లుగా చూపుతూ.. రూ.65 లక్షల మిగులుతో రివైజ్డ్ బడ్జెట్‌ను ఆమోదించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి అన్ని పద్దులు కలిపి మొత్తం ఆదాయం రూ.1013.80కోట్లు కాగా, అన్ని పద్దుల కింద వ్యయం రూ.1013.10కోట్లు కాగా.. రూ.70 లక్షలు మిగులుగా చూపారు. ఆదాయంలో జడ్పీ సాధారణ నిధులు రూ.28కోట్లు, ప్రభుత్వం నుంచి కేటాయించే శాలరీ గ్రాంట్లు రూ.10.48 కోట్లు, నిర్దిష్ట గ్రాంట్లు రూ.46.09 కోట్లు, డ్వామా, గ్రామీణ నీటి సరఫరా, ఇతరశాఖల ద్వారా వచ్చే గ్రాంట్లు రూ.922.39 కోట్లుగా ఉన్నాయి. జడ్పీ సాధారణ నిధుల నుంచి షెడ్యూల్డ్ కులాల సంక్షే మానికి 15శాతం రూ.2.97కోట్లు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమానికి ఆరుశాతం కేటాయింపు రూ.1.19 కోట్లు, మహిళా శిశు సంక్షేమానికి 15శాతం కేటాయింపు రూ.2.97 కోట్లు, అభివృద్ధి పనులకు 23 శాతం నిధులు కేటాయిస్తూ బడ్జెట్‌నుసమావేశం ఆమోదించింది.

నిబంధనలు ఏం చెబుతున్నాయి: ఎమ్మెల్యే వేగుళ్ల



ఉపాధి హామీ పథకం నిధుల వినియోగంలో నిబంధనలు ఏం చెబుతున్నాయని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రశ్నించారు. తక్కువ ఖర్చు చేసిన జిల్లాల నుంచి నిధులను వేరే జిల్లాలకు బదలాయించుకోవచ్చా అని ప్రశ్ని ంచారు. తనకు తెలిసి ఉండగా ఎన్ఆర్ఈజీఎస్‌లో అలాంటి నిబంధనలేవీ లేవని, ఏ జిల్లాకు కేటాయించిన నిధులు ఆ జిల్లాలోనే ఖర్చు చేయాలని, పక్క జిల్లా నుంచి నిధులు తెచ్చే ప్ర యత్నం చేస్తున్నామని ఏ విధంగా చెబుతున్నారని కాకినాడ జిల్లా కలెక్టర్‌ను ఉక్కిరిబిక్కిరి చేశారు. దీంతో కాస్త తడబడిన కలెక్టర్ తనకు దీనిపై పూర్తి అవగాహన లేదని, నిబంధనలు నిశితంగా పరిశీలిస్తానని వివరణ ఇచ్చారు.

హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ ఇబ్బందులు: ఎమ్మెల్సీ ఇళ్ల

విద్యార్థుల హాల్ టికెట్లు వాట్సాప్‌లో డౌన్‌లోడ్ చేసుకునే సౌలభ్యం విద్యాశాఖ కల్పించినా ఫీజులు చెల్లించలేదని యాజమాన్యాలు ఏ విధంగా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తాయని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. దీనిపై కాకినాడ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నర్సింగ్ కళాశాల పరీక్షల హాల్ టికెట్లు మాత్ర మే వాట్సాప్‌లో రాని పరిస్థితి ఉంది.. వాటిపై దృష్టిపెడతామని స్పష్టం చేశారు.



జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు వెళ్లి వస్తూ..

గుండెపోటుతో జనసైనికుడి మృతి

పార్టీ అధినేత పవన్ సంతాపం


పవన్ ఆదేశాలతో దుర్గాప్రసాద్ తల్లి పార్వతికి రూ.2 లక్షలు నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అమలాపురం రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు వెళ్లి తిరిగి వస్తుండగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి గ్రామానికి చెందిన జనసైనికుడు అడపా దుర్గాప్రసాద్ (42) అలియాస్ చిన్నా గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందాడు. శనివారం సమాచారం తెలుసుకున్న జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మృతుని కుటుంబానికి సంతాపం ప్రకటించారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడలో శుక్రవారం జరిగిన జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు ఏర్పాటు చేసిన బస్సులో గ్రామం నుంచి దుర్గాప్రసాద్ వెళ్లాడు. అనంతరం రాత్రి చిత్రాడ నుంచి బస్సులో సహచరులతో కలిసి బయలుదేరారు. బస్సులో గుండెపోటుతో మరణించాడు. తెల్లవారుజామున దుర్గాప్రసాద్ మృతదేహాన్ని స్వగ్రామమైన ఈదరపల్లి గ్రామానికి తీసుకువచ్చారు. సమాచారం తెలుసుకున్న జనసైనికులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తిచేశారు. మృతుడికి తల్లి పార్వతితో పాటు సోదరుడున్నారు. తల్లి గత కొంతకాలంగా అనారోగ్యంతో మంచాన ఉంది.

దుర్గాప్రసాద్ ఆత్మకు శాంతి చేకూరాలి : పవన్‌కల్యాణ్

జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు వచ్చి తిరిగి వెళ్తుండగా దుర్గాప్రసాద్ హఠాన్మరణం చెందారని తెలిసి చింతిస్తున్నానని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంతాప సందేశాన్ని విడుదల చేశారు. దుర్గాప్రసాద్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు. ఆ కుటుంబానికి పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని ప్రకటించారు. జనసేన శాసనమండలి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్ సూచనల మేరకు అమలాపురం నియోజకవర్గ జనసేన నాయకులు సీనియర్ నేత నల్లా శ్రీధర్ ఆధ్వర్యంలో దుర్గాప్రసాద్ ఇంటికి చేరుకున్నారు. ఆ కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.50వేలు అందించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, నాయకులు దుర్గాప్రసాద్ ఇంటికి చేరుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ రూ2.లక్షలు ఆ కుటుంబానికి ఆర్థికసాయం అందించగా ఆ మొత్తాన్ని వారు అందజేశారు.

పుష్కరాలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలి

రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి


తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో చర్చిస్తున్న ఎంపీ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి పుష్కరాలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని తక్కువ నీటి వినియోగం-దుర్గంధంలేని టాయిలెట్స్ ఏర్పాటుపై రోసారి ప్రొఫెషనల్ టీంతో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఎంపీ పురందేశ్వరి, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహకిశోర్, కమిషనర్ కేతన్ గార్గ్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేసర్స్ రోసారి ప్రొఫెషనల్‌తో వాటర్ లెస్ ఒడోర్‌లెస్ ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హేమంత్, సత్యనారాయణ వివరించారు. పురందేశ్వరి మాట్లాడుతూ ప్రధాని మోదీ స్వచ్ఛభారత్ స్వచ్ఛ ఆవాస్ కార్యక్రమం కింద విజన్-2047 దిశగా అడుగులు వేస్తు న్నట్టు చెప్పారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా టాయిలెట్స్ ఏర్పాటు చేసే క్రమంలో ప్రకృతి వనరులను సంరక్షించే దిశగా తక్కువ నీటి వినియోగం వాసనలేని టాయిలెట్స్ ఏర్పాటు చేసే ప్రాజెక్ట్ ఆలోచన రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఇందుకోసం కంపెనీ ప్రతినిధులతో ప్రాజెక్ట్‌పై సమగ్రంగా చర్చించినట్టు తెలిపారు. ప్రకృతి వనరుల సంరక్షణ వాసనలేని నీరులేని మూత్ర విసర్జన్ పరికరం పరిశుభ్రతను పెంచడమే కాకుండా నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు స్థిరమైన పారిశుధ్య నిర్వహణసామర్థ్యం పెంచడం ఈ ప్రాజెక్ట్‌లో ప్రధాన అంశమని కమిషనర్ వివరించారు.

చంద్రకిషోర్, కుమారుల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

సర్పవరం జంక్షన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ 2వ డివిజన్ తోట సుబ్బారావు నగర్ రోడ్డు నెంబర్-2, రామానాయపేట భూదేవి అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న వానపల్లి చంద్రకిషోర్ (37) తన పిల్లలను చంపి తాను కూడా శుక్రవారం ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. కాకినాడ జీజీహెచ్‌లో ఇద్దరు చిన్నారులు, చంద్రకిషోర్ మృతదేహాలకు వైద్యులు శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబసభ్యులకు మృతదేహాలను అప్పగించారు. సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాడేపల్లిగూడెంకు చేరిన మృతదేహాలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో తన ఇద్దరు కుమారులను చంపి తాను ఆత్మహత్య చేసుకున్న వానపల్లి చంద్రకిషోర్, పిల్లలు జోషిల్, నిఖిల్ మృతదేహాలు శనివారం రాత్రికి తాడేపల్లిగూడెంలోని చంద్రకిషోర్ తండ్రి సూరిబాబు నివాసానికి చేరాయి. తాను చనిపోవడమే కాకుండా తన ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారులను చంపాడనే వార్తతో తాడేపల్లిగూడెం పాతూరులో విషాదఛాయలు అలముకున్నాయి.


అంబులెన్స్‌లో చంద్రకిషోర్, జోషిల్, నిఖిల్ మృతదేహాలు

పోతవరంలో పవర్ లిఫ్టింగ్ పోటీలు

పది కేటగిరీల్లో 30 మంది విజేతలు, చాంపియన్ ఆఫ్ చాంపియన్

పాల్గొన్న అల్లూరి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల క్రీడాకారులు


పోతవరంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు


విజేతలకు బహుమతి, ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

పి.గన్నవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ ఫిట్నెస్ జోన్ ఐదవ వార్షికోత్సవం పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోతవరంలో యునైటెట్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ అండ్ బెంజ్ ప్రెస్-2025 పోటీలు జరిగాయి. కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అండ్ ఎస్ఎస్ ఫిట్నెస్ జోన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన పోటీలను శనివారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం వ్యాయమం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యవంతంగా జీవించవచ్చన్నారు. పోటీలకు ఆధ్వర్యం వహించిన ఎస్ఎస్ ఫిట్నెస్ జోన్ నిర్వహకులు కత్తుల శ్రీనివాస్‌ను అభినందించారు. ఈవెంట్ ఆర్గనైజర్ కత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొనున్నట్టు వివరించారు. 3 విభాగాల్లో (మహిళలు, మాస్టర్స్, బాయ్స్) మొత్తం 10 కేటగిరిలకు సంబంధించి మెన్ 53, 59, 66, 74, 83, 93 కిలోల మాస్టర్స్, బాయ్స్ విభాగాలు పాల్గొనగా, 63 కిలోల లోపు, ఆపైన కిలోల విభాగాల్లో మహిళలు పాల్గొన్నారు. మొత్తం 3 కేటగిరిలకు సంబంధించి మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలకు గాను 30మందికి విజేతలతో పాటు చాంపియన్ ఆఫ్ చాంపీయన్ విన్నర్‌కు ట్రోఫీ, నగదు పురస్కారాలు, మెరిట్ సర్టిఫికెట్, మెడల్, నేషనల్ షీల్డ్‌లను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, కోనసీమ జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యనుమల వెంకట పద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్ననాయుడు, సంసాని పెద్దిరాజు, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, దైవాల రాంబాబు, యన్నాబత్తుల ఆనంద్, చికిలే తరుణ్, తోలేటి వంశీకృష్ణ, బొరుసు రాజబాబు, నందుల సన్నీ, తోలేటి రాజా, జిమ్ సభ్యులు పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో భక్తుల రద్దీ

3 వేల వ్రతాలు, రూ.40 లక్షల ఆదాయం


స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

అన్నవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం వివాహ ముహూర్తాలు ఉండడంతో అన్న వరం కొండపై, ఇతర ప్రాంతాల్లో ఒక్కటైన జం టలు, ఆయా పెండ్లిబృందాలతో రద్దీ ఏర్పడింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో సుబ్బారావు ఆదేశాలతో అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక దర్శనానికి గంట సమయం, ఉచిత దర్శనానికి 2గంటల సమయం భక్తులు వేచిఉన్నారు. శనివారం ఒక్కరోజు సుమారు 3 వేల వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా రూ.40లక్షల ఆదాయం లభించింది. సత్యదేవునికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది.

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి పూజలు


అంతర్వేదిలో శ్రవణ్‌కుమార్‌కు చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

అంతర్వేది, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి శనివారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జస్టిస్ ఎన్వీ. శ్రవణ్‌కుమార్ విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేద పండితులచే మహదాశీర్వచనం జరిపించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ సూపరింటెండెంట్ వి.విజయసారథి అందింజేశారు.

జీజీహెచ్‌లో ముగ్గురు జీబీఎస్ బాధితులకు చికిత్స

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) బారిన పడిన ముగ్గురు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి శనివారం తెలిపారు. వారిలో ఇద్దరు జీబీఎస్‌తో బాధపడుతుండగా మరో వ్యక్తిలో అనుమానాస్పద లక్షణాలు కనిపించడంతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. జీబీఎస్ కేసులకు సంబంధించి జీజీహెచ్‌లో చికిత్స మందులు, వ్యాక్సిన్, మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

తాడేపల్లిగూడెం రోడ్డు ప్రమాద మృతులకు

మండపేటలో అంత్యక్రియలు

మండపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలోని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. మృతదేహాలకు పోస్టుమార్టం మండపేటకు తీసుకురావడంతో శుక్రవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులు, బంధువులు అంత్యక్రియలను నిర్వహించారు.

గందరగోళంగా పోలవరం సభ

చింతూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పోలవరం సభ మరోమారు అసంపూర్తి, భిన్నాభిప్రాయాలతో పాటు గందరగోళం నడుమ ముగిసింది. చింతూరులో శనివారం పోలవరం నిర్వాసితుల పునరావాస స్థల నిర్ధారణ సభ జరిగింది. కొద్దిరోజుల క్రితం సామాజిక మాధ్యమాల్లో వెలువడిన పీడీఎఫ్ (నిర్వాసితుల లిస్ట్) నేపథ్యంలో నిర్వహించిన ఈ సభను ఆర్ అండ్ ఆర్‌లో ఒక భాగమైన కరువ భత్యపు సభగా నిర్వాసితులు భావించారు. ఆ పీడీఎఫ్‌లో పలువురి పేర్లు కన్పించకపోవడంతో సభలో కొద్ది నిమిషాలపాటు గందరగోళం ఏర్పడింది. సామాజిక మాధ్యమాల్లో వెలువడిన పీడీఎఫ్ అనధికారమని పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.చంద్రశేఖర్, నాగమణి స్పష్టం చేయడంతో గందరగోళం సద్దుమణిగింది. కాగా డివిజన్ కేంద్రమైన నిర్వాసిత గిరిజన కుటుంబాలకు ఎటపాక మండలంలో కాలనీలు, సాగుభూమి సమకూర్చనున్నట్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తెలిపారు. స్పందించిన గిరిజన నిర్వాసితులు తమకు ఎటపాక మండలంలో భూములు వద్దని, చింతూరు మండలంలో ముంపునకు గురికాని గ్రామాలైన లక్కవరం, తులసిపాకలలో భూమికి భూమి, కాలనీలు కేటాయించాల్సిందిగా కోరారు. గిరిజనేతర నిర్వాసితులకు పశ్చిమగోదావరి జిల్లాలోని తాడువాయి, యాదవోలు గ్రామాల్లో కాలనీలు నిర్మించే విషయంలో నిర్వాసితులు తమ నిరయం ప్రకటించా ల్సిందిగా ఎస్‌డీసీలు కోరారు. గిరిజనేతరులు కూడా తమకు తాడ్వాయి, యాదవోలు గ్రామాలు వద్దని, ఆయా గ్రామాల మీదుగా గ్యాస్ పైప్ లైన్ వెళుతుండడంతో పాటు సురక్షితమైన తాగునీరు కూడా లభ్యమయ్యే పరిస్థితి లేదని నిర్వాసితులు విముఖత వ్యక్తం చేశారు. అదే దశలో తమకు తూర్పుగోదావరి జిల్లా గోకవరం సమీపంలోని కృష్ణునిపాలెంలో కాలనీలు ఏర్పాటు చేయించాల్సిందిగా కోరారు. దీంతో గిరిజన, గిరిజనేతర నిర్వాసితుల అభిప్రాయాలను అధికారులు నోట్ చేసుకున్నారు. నిర్వాసితుల నిర్ణయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాగా పరిహారం పెంపు, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు చేయాలన్న పలుడిమాండ్లు నిర్వాసితుల నుంచి వచ్చాయి.

సికింద్రాబాద్‌కు రాకుండా

మరో 9 రైళ్ల దారి మళ్లింపు

స్టేషన్ పునరాభివృద్ధి పనుల నిమిత్తం నిర్ణయం

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనుల నిమిత్తం మరో 9 రైళ్లను దారి మళ్లిస్తున్నట్టు శనివారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. వీటిలో 4 ఎక్స్‌ప్రెస్ రైళ్లను చర్లపల్లి, అమ్ముగూడ, లింగంపల్లి మీదుగా మరో 5 ఎక్స్‌ప్రెస్ రైళ్లను చర్లపల్లి, మౌలాలి బైపాస్ మీదుగా కామారెడ్డి వైపు మళ్లించాలని నిర్ణయించి నట్టుసీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. ఏప్రిల్ 22 నుంచి విశాఖపట్నం-ముంబై-విశాఖపట్నం (20809/20810), మచిలీపట్నం-షిర్డీ-మచిలీపట్నం వీక్లీ (17207/17208), ఏప్రిల్ 23 నుంచి కాకినాడ-షిర్డీ-కాకినాడ ట్రై వీక్లీ (17205/17206), మే 9 నుంచి వాస్కోడగామా-జసిదిడ్-వాస్కోడగామా వీక్లీ (17321/17322) ఎక్స్‌ప్రెస్ రైళ్లను చర్లపల్లి, అమ్ముగూడ, సనత్‌నగర్, లింగంపల్లి మీదుగా మళ్లించనున్నట్టు చెప్పారు. అలాగే ఏప్రిల్ 24 నుంచి విశాఖపట్నం-సాయినగర్ షిర్డీ- విశాఖపట్నం వీక్లీ (18503/18504), ఏప్రిల్ 25 నుంచి నర్సాపూర్-నాగర్‌సోల్-నర్సాపూర్ (12787/12788), సంబల్‌పూర్-నాందేడ్ ట్రైవీక్లీ (20809/20810), ఏప్రిల్ 26 నుంచి విశాఖపట్నం-నాందేడ్- విశాఖపట్నం ట్రైవీక్లీ (20811/20812), ఏప్రిల్ 28 నుంచి నర్సాపూర్-నాగర్‌సోల్-నర్సాపూర్ బై వీక్లీ (17231/17232) ఎక్స్‌ప్రెస్ రైళ్లను చర్లపల్లి, మౌలాలి బైపాస్ మీదుగా కామారెడ్డి వైపుమళ్లించనున్నట్టు శ్రీధర్ తెలిపారు.

అమలాపురం

గ్రామాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి

● స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



ముంగండలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపుని చ్చారు. ముంగండ గ్రామంలో నిర్వహించిన సచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని అనంతరం మాట్లాడారు. మనఇంటిని ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటామో అదే తరహాలో గ్రామాన్ని శుభ్రం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఈ కార్యక్రమం మన ఊరి భవిష్యత్తుగా భావించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు.

అనంతరం 2కె రన్ నిర్వహించి గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలో నిరంతరం శ్రమి స్తున్న పారిశుధ్య కార్మికులను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గని శెట్టి నాగలక్ష్మి, ఎంపీడీవో కేవీ ప్రసాద్, సర్పంచ్ కుసుమ చంద్రకళ, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, పెచ్చెట్టి వెర్రియ్య, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, తాటికాయల శ్రీనివాసరావు, అంబటి కొటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి అధికారి రవిసుభాష్





ముమ్మిడివరంలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రత్యేకాధికారి రవిసుభాష్, కామనగరువులో ప్రతిజ్ఞ చేస్తున్న డీపీవో శాంతలక్ష్మి

ముమ్మిడివరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి పర్యావరణ పరిరక్షణలో ప్రతీఒక్కరు భాగస్వాములు కూడా కావాలని జిల్లా ఇన్‌చార్జి అధికారి పి.రవిసుభాష్ పిలుపునిచ్చారు. ముమ్మిడివరం మండలం అనాతవరంలో సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ వర్మికంపోస్టు షెడ్డును ఆయన పరిశీలించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో వెంకటాచార్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఏదొక ఇతివృత్తంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. మార్చి నెలలో 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధిద్దాం, పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహిద్దాం' అనే ఇతివృత్తంతో స్వచ్ఛదివస్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ సంచుల వాడకం కారణంగా ఆరోగ్యం దెబ్బతింటుందని, ప్లాస్టిక్ పాత్రలో ఆహారం హానికరమని, ప్లాస్టిక్ సంచులు, బ్యాగులకు బదులుగా ప్రత్యామ్నాయంగా కాగిత, గుడ్డసంచులు, జ్యూట్ వంటివి వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో ఇళ్ల నుంచి చెత్తను సేకరించేటప్పుడు పొడి, తడి చెత్తను వేరు చేసి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. జిల్లాలోని 385 గ్రామ పంచాయతీలకు గాను 268 గ్రామ పంచాయతీల్లో సాలిడ్‌వేస్టు మేనేజ్‌మెంట్, వర్మికంపోస్టు షెడ్ల నిర్మాణం పూర్తయిందని, ఇంకా 117 గ్రామ పంచాయతీల్లో షెడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందని అధికారులు ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ ప్రజలంతా స్వచ్ఛతను పాటించాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారిణి డి.శాంతలక్ష్మి, ముమ్మిడివరం తహశీల్దార్ ఎం.సుబ్బలక్ష్మి, డివిజనల్ పంచాయతీ అధికారి బి.బొజ్జిరాజు, ఈవోపీఆర్డీ సీహెచ్ లక్ష్మీ కల్యాణి, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కురసాల శివలతోపాటు పలువురు పాల్గొన్నారు.

● స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ప్రమాదకరం, ప్లాస్టిక్‌ను తుంచుదాం.. ఆముష్షను పెంచుదాం. ప్లాస్టిక్‌ను తుంచు.. మొక్కలను పెంచు అనే నినాదంతో బ్యానర్లు చేతబట్టి ముమ్మిడివరంలో ర్యాలీ నిర్వహించారు. దుకాణదారులు, ప్రజల్లో ప్లాస్టిక్ వాడకం, నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవివర్మ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగించడంవల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. అనంతరం పట్టణంలో పలు దుకాణాల్లో తనిఖీ నిర్వహించి ప్లాస్టిక్ వాడుతున్నట్టు గుర్తించి జరిమానా విధిస్తామన్నారు. మేనేజర్ పీవీ నూకరాజు, ఏఈ పీవీ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ జె.సత్యనారాయణరాజు, సచివాలయ, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధించాలంటూ అవగాహన ర్యాలీ

ఉప్పలగుప్తం: చల్లపల్లిలో పంచాయతీ, ఉపాధి, ఆరోగ్య సిబ్బంది, కూటమి నాయకుల ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు, ఆరోగ్య భద్రతకు ప్లాస్టిక్‌ను నిషేధించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు, పంచాయతీ కార్యదర్శి అడబాల శ్రీరామచంద్రమూర్తి, కూటమి నాయకులు నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, గొలకోటి చిన్నా, దంగేటి రవీంద్రనాథ్ , దంగేటి బాబులు, పోలిశెట్టి శివాజీ, బూసి బుజ్జిదొర పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం అనర్థదాయకం

ఐ.పోలవరం: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం గుత్తెనదీవి సాయిరాం విద్యానికేతన్ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వినియోగంవల్ల అనర్థాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ సలాది శ్రీనివాసరావు ప్లాస్టిక్ నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఎం మాగాపు సీతారత్నం, ఉపాధ్యాయులు నాటి ధనరాజు, నాగేంద్ర వర్మ, ఎస్.భూలక్ష్మీదేవి, ఎ.శిరీష పాల్గొన్నారు.

రాజోలు: రాజోలు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రేవు జ్యోతి అధ్యక్షతన శనివారం జరిగిన గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఎంపీడీవో రాంబాబు, సర్పంచ్ జ్యోతి పారిశుధ్య సిబ్బందితో కలిసి పురవీధుల్లో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను డస్ట్‌బిన్లలో వేయాలని సూచించారు. సర్పంచ్ జ్యోతి మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నిషేధించాలని ప్రజలను కోరారు. రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రాజోలు ఎంఈవో ఎన్.మనోహరం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సమగ్రశిక్ష సీఎంవో బి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. జాతీయ అంధత్వ నివారణలో భాగంగా కొత్తపేట పీహెచ్‌సీ సిబ్బంది ఇటీవల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి చూపులో దోషాలు ఉన్న 29 మంది విద్యార్థులకు సీఎంవో సుబ్రహ్మణ్యం చేతులమీదుగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ రెహ్మాన్, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, ఉపసర్పంచ్ పామర్తి రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి : డీపీవో

అమలాపురం రూరల్: పర్యావరణ పరిరక్షణలో ప్రతీఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా పంచాయతీ అధికారిణి డి.శాంతలక్ష్మి పిలుపునిచ్చారు. నిషేధిక ప్లాస్టిక్ వస్తువులను వినియోగించడం వల్ల పర్యావరణం దెబ్బతినడంతో పాటు భవిష్యత్తు తరాలవారికి తీవ్ర ఇబ్బందులు తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధాన్ని విధించారని ఎవరూ వాటిని వినియోగించరాదని సూచించారు. కామనగరువు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛదివస్ కార్యాక్రమం సర్పంచ్ నక్కా అరుణకుమారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీపీవో స్థానిక షాపుల యజమానులు, ప్రజలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బి.మంగాదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ చినబాబు, కార్యదర్శి రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, నక్కాచంద్రశేఖర్, పర్తంశెట్టి ఆదినారాయణ, వార్డు సభ్యులు, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పెనుమాల సునీత ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, కార్యదర్శి కోరుమిల్లి శ్రీనివాస్, బుజ్జిరాజు, కూర్మా క్రీస్తుఏసు, అంకం కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు. చిందాడగరువు పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రతిజ్ఞ, ర్యాలీ కార్యక్రమాల్లో సర్పంచ్ పొణకల గణేష్, ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ-వెంకటేశ్వరరావు, కార్యదర్శి రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు తదితరులు పాల్గొన్నారు. అమలాపురం ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో వలవల శివరావుతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అయినవిల్లి: అయినవిల్లిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం గ్రామ సర్పంచ్ కాకర శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. తడి-పొడి చెత్త సేకరణపై ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. ముక్తేశ్వరం సెంటర్‌లో మానవహారం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణాధికారి వాణికుమారి బెహరా, పంచాయతీ కార్యదర్శి కొంకి రామచంద్రరావు, వివిధ శాఖలకు సంబంధించిన సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర... స్వచ్ఛాంధ్ర

అంబాజీపేట: స్వర్ణాంధ్ర... స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, అధికారులు స్వచ్ఛభారత్ నిర్వహించారు. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. పలు సచివాలయాలు, పీహెచ్‌సీలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు గోవర్ధనరావు, నీరజ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దింట్లమ్మ జాతర

మామిడికుదురు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గోగన్నమఠంశివారు తోటమెరకలో ఉన్న శ్రీపెద్దింట్లమ్మవారి జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, గరగ నృత్యాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

11 కేంద్రాల్లో బ్రిడ్జి కోర్సు పరీక్షలు

అమలాపురంటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి):జనరల్ ఇంటర్మీడియట్‌లో మేజర్ సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు పూర్తయ్యాయని డీఐఈవో సోమశేఖరరావు తెలిపారు. ఈనెల 17, 18 తేదీల్లో జిల్లాలోని 11 పరీక్షా కేంద్రాల్లో మాత్రమే బ్రిడ్జి కోర్సు పరీక్షలు జరుగుతాయన్నారు. 19, 20 తేదీల్లో ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాగ్రఫీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 20వ తేదీతో మొత్తం ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తవుతాయన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు, హిందీ, ఇంగ్లీషు, గణితం, పౌరశాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నాపత్రాల వాల్యుయేషన్ ప్రారంభమవుతుందన్నారు. సంస్కృతం జవాబుపత్రాల మూల్యాంకనం ఇక్కడ జరుగుతుందని డీఐఈవో తెలిపారు.

తాత్కాలిక ఎంపీపీగా అరుణకుమారి



కాట్రేనికోన, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన తాత్కాలిక ఎంపీపీగా వైస్ చైర్మన్ యేడిది అరుణకుమారి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ పాలెపు లక్ష్మి ఇటీవల మృతి చెందారు. జడ్పీ సీఈవో ఉత్తర్వుల మేరకు ఈ నియామకం జరిగినట్టు ఎంపీడీవో చలం తెలిపారు.

నగర పంచాయతీ ఏఈగా శ్రీనివాస్



ఏఈగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

ముమ్మిడివరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ ఏఈగా కోర్ల శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ ఏఈగా విధులు నిర్వహించిన కె.సత్యనారాయణ రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు బదిలీ అవ్వడంతో రామచంద్రపురం మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కోర్ల శ్రీనివాస్ పదోన్నతి లభించడంతో ఏఈగా ముమ్మిడివరం నగర పంచాయతీ ఏఈగా నియమితులయ్యారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఏఈగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను కార్యాలయ ఉద్యోగులు, పలువురు అభినందనలు తెలిపారు.

షెడ్యూల్డు కులాల కార్మికులకు శిక్షణ

అంతర్వేది, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో ఆక్వా కల్చర్ చెరువుల్లో బయో సెక్యూరిటీ, వ్యక్తిగత పరిశుభ్రతపై షెడ్యూల్డు కులాల కార్మికులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించామని ఫీల్డు మేనేజర్ సునీల్ తెలిపారు. ఎంపెడ ఆధ్వర్యంలో కోనసీమ జిల్లా డాక్టర్ వై.బంగారమ్మ పర్యవేక్షణలో షెడ్యూల్డు కులాల రైతులకు శిక్షణ అనంతరం కిట్‌లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జేటీవో ఎస్.శ్రీనివాసరావు, ఫీల్డుమేనేజర్ పి.సునీల్‌కుమార్, గోపాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్‌కు మరిన్ని సౌకర్యాలు



క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న మల్లాడి

యానాం,మార్చి 15(ఆంధ్రజ్యోతి):స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో స్విమ్మింగ్ పూల్‌కు మరిన్న సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. యానాం భారతీయ క్రీడాప్రాధికార సంస్థ(శాయ్) యానాంశాఖ ఆధ్వర్యంలో అండర్ 12,14,17లో బాల, బాలికలకు వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఈపోటీలలో ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. యానాం సెంటార్ ఇన్‌చార్జ్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మల్లాడి మాట్లాడుతూ యానాంలో ఉన్న ఈ స్విమ్మింగ్‌పూల్‌ను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం జిమ్‌ను పరిశీలించారు. కోచ్ రవితేజ, రజాఖ్ పాల్గొన్నారు.

1/2019 సర్క్యులర్‌ను అమలుచేయాలి

అమలాపురంరూరల్, మార్చి15 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపో డ్రైవర్లపై వేధింపులకు నిరసనగా యునైటెడ్ వర్కర్స్ యూనియన్ నేషనల్ మజ్దూర్ యూనియన్‌ల ఆధ్వర్యంలో శనివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఎన్ఎంయూ డిపో కార్యదర్శి పి.మణిరాజు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, డ్రైవర్ బీఎస్ నారాయణపై అక్రమంగా విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ కేజీ రావు డిపోలో అందుబాటులో ఉన్నప్పటికీ రోజూ గైర్హాజరు పేరుతో ఆబ్సెంట్ వేయడం దారుణమన్నారు. ఆర్టీసీ డిపోలోనే సమస్యలను యునైటెడ్ వర్కర్స్ యూనియన్‌జిల్లా కార్యదర్శి వంకా గణపతి వివరించారు. డిపో ప్రెసిడెంట్ హౌలియా, కార్యదర్శి కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు పూర్తిచేయాలి

అల్లవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన అదనపు సహాయాన్ని గృహనిర్మాణదారులు వినియోగించుకుని అభివృద్ధి పనులు పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన అదనపు సహాయంతో గృహనిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ కోరారు.

కాన్షీరామ్ జయంతి

అమలాపురంరూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్‌పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ 91వ జయంతిని పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అమలాపురం ఎర్రవంతెన వద్ద పార్టీ కార్యాలయంలో కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి బాటసారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, జిల్లా ఇన్‌చార్జి కాశి భవానీ, సీనియర్ నాయకుడు జిత్తుక సత్యనారాయణ, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు పెండెం శ్రీనివాస్, జేడీఎస్ రాజు, బుడితి దయామహేష్, వాకపల్లి హరీష్, రేవు తిరుపతిరావు, శెట్టిబత్తుల తులసీరావు, ఎస్ఎస్ఆర్ భూపతి, మట్ట వెంకట్రావు, పెనుమాల చిట్టిబాబు, కండిబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరామ్ జయంతిని ఆదివారం కాట్రేనికోన గేట్ సెంటర్‌లో నిర్వహించారు. ముమ్మిడివరం నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు బడుగు భీమేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది.

పీచు ఫ్యాక్టరీని తొలగించాలి

మలికిపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గొల్లపాలెంలో ఓఎన్జీసీ జీజీఎస్ పక్కన ఉన్న పీచు ఫ్యాక్టరీని వెంటనే తొలగించాలని ఓఎన్జీసీ అధికారులు చర్యలు తీసుకోవాలంటూ తూర్పుపాలెం, గొల్లపాలెం గ్రామస్తులు ఓఎన్జీసీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. గత నాలుగు రోజుల క్రితం గ్యాస్ విష వాయువు లీకై పలువురు అస్వస్థతకు గురైన సంఘటన మరువకముందే జీజీఎస్ పక్కన పీచుఫ్యాక్టరీ దగ్ధంకావడంతో భయపడు తూ బతుకుతున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

మలికిపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విశ్వేశ్వరాయపురంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో రూ.12లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లుబోయిన హెలీన, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెదకాపు, ఎంపీటీసీ గుబ్బల గౌరీ, నీటిసంఘం అధ్యక్షుడు సుబ్బారావు, సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

పి.గన్నవరం/ఐ.పోలవరం/మలికిపురం/అల్లవరం/అంతర్వేది మార్చి 15(ఆంధ్రజ్యోతి): మానేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు టీడీపీ నాయకులు పెచ్చెట్టి వీరవెంకటసత్యనారాయణ ఆర్థిక సాయంతో పరీక్షా సామాగ్రిని అందించారు. ఐ.పోలవరం మండలం టీకొత్తపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన 37మంది టెన్త్ విద్యార్థులకు గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. మలికిపురం మండలం చింతలమోరి జిల్లా పరిషత్ హైస్కూలులో పదో తరగతి విద్యార్థులకు పింక్ హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని అందజేశారు. అల్లవరం మండలం మల్లాడి హనుమంతరావు ఫౌండేషన్, హెల్పింగ్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్టు అమలాపురంశాఖ ఆధ్వర్యంలో శనివారం ఓడలరేవు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్‌లను పంపిణీ చేశారు. సఖినేటిపల్లి మండలం టేకిశెట్టిపాలెం గ్రామంలో విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని విద్యార్థి సంఘ నాయకులు శనివారం అందించారు.

వినియోగదారుల చట్టంపై ప్రజల్లో చైతన్యం రావాలి

● జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్



వినియోగదారుల ఫోరం ప్రతినిధి బలరామమూర్తిని సన్మానిస్తున్న అధికారులు


అమలాపురం టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల రక్షణచట్టంపై ప్రజల్లో చైతన్యం వచ్చినప్పుడే ఆ చట్టం లక్ష్యం నెరవేరుతుందని జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో శనివారం వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత స్టాల్స్ ప్రదర్శన తిలకించారు. గ్యాస్ వినియోగంపై అవగాహన, వినియోగదారుల ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన కార్యక్రమంలో ఉదయభాస్కర్ మాట్లాడుతూ మార్కెట్‌లో వ్యాపారులు చేసే మోసాలను బిల్లు ఆధారంగా అరికట్టవచ్చునన్నారు. లోపలు ఉన్న వస్తువులు కొనుగోలు చేసినప్పుడు వినియోగదారుడు నష్టపోతే ప్రశ్నించేందుకు ఉన్న చట్టాలను ఉపయోగించుకోవాలన్నారు. సరైన సేవలు, పరిహారాల కోసం వినియోగదారుల రక్షణచట్టం-2019 అమలులో ఉందన్నారు. అనంతరం వినియోగదారుల హక్కుల కోసం శ్రమిస్తున్న ఫోరం ప్రతినిధులు అరిగెల బలరామమూర్తి, మాలే శ్రీనివాసనగేష్ తదితరులను జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో సత్కరించారు. జిల్లాపౌరసరఫరాల మేనేజర్ బాలసరస్వతి, తూనికలు, కొలతల కంట్రోలర్ రాజేష్, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర గణనీయం

● సహకారశాఖ జిల్లా అధికారి మురళీకృష్ణ

ఉప్పలగుప్తం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): భారత దేశంలో గ్రామాల అభివృద్ధికి సహకార సంఘాలు గణనీయమైన పాత్ర పోషిస్తున్నాయని సహకారశాఖ జిల్లా అధికారి ఎస్.మురళీకృష్ణ అన్నారు. మండలంలో ఆయన పర్యవేక్షణలో శనివారం అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025 వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర అనే అంశంపై హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో డివిజనల్ సహకార అధికారి వి.రాధాకృష్ణారావు, జిల్లా ట్రైనింగ్ ఇన్‌చార్జి ఆదిమూలం వెంకటేశ్వరరావు, ఎంఈవో కె.కిరణ్‌బాబు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు వి.రమేష్‌బాబు, డి.రాజారత్నం, వి.వెంకటనారాయణ, ఇన్‌చార్జి హెచ్ఎం అరవ స్వామినాయుడు, సహకార సీఈవోలు పోలిశెట్టి దుర్గాప్రసాద్, మంచెం బాబి, చిక్కం లింగయ్యనాయుడు, కె.శ్రీనివాసరాజు, ఆకుల సూరిబాబు, ఆకుల గణేష్, ఎన్.సతీష్ పాల్గొన్నారు.

'ఓడలరేవు అభివృద్ధిని విస్మరిస్తే ఉద్యమిస్తాం'



దీక్షా శిబిరంలో సంఘీభావం తెలుపుతున్న రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి

అల్లవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కేజీ బేసిన్ పరిధిలో చమురు ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉన్న ఓడలరేవు గ్రామాభివృద్ధి, స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వకుంటే ఓఎన్జీసీ కార్యకలాపాలు స్తంభింపచేసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని గ్రామస్థులు అల్టిమేటం జారీ చేశారు. ఓడలరేవు గ్రామదత్తత, అభివృద్ధి, స్థానిక యువతకు ఉపాధి, ఓడలరేవు తీర ప్రాంత రక్షణ, ఓడలరేవు పర్యాటకకేంద్రంగా అభివృద్ధి డిమాండ్లను నెరవేర్చకుంటే ఓఎన్జీసీ టెర్మినల్ నిర్మాణ పనులను కార్యకలాపాలను అడ్డుకుంటామన్నారు. అల్లవరం మండలం ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద గ్రామస్తులు చేస్తున్న రిలే దీక్షలు శనివారం 13వ రోజుకు చేరుకున్నాయి. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, వేగిరాజు వెంకట్రాజు, మంతెన సురేష్‌రాజు, టీడీపీ నేతలు రిలే దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావాన్ని తెలిపారు.

లంకలగన్నవరం ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా గంగాభవాని

పి.గన్నవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): లంకలగన్నవరం గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా రెండవ వార్డు మెంబరు, ఉపసర్పంచ్ గనిశెట్టి గంగాభవాని శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ఉత్త ర్వుల మేరకు వార్డు సభ్యుల సమక్షంలో సర్పంచ్‌గా గంగాభవాని బాధ్యతలు స్వీకరించగా వార్డు సభ్యుల సమావేశం జరిగింది. అనంతరం సర్పంచ్ పసలపూడి రామకృష్ణ మృతిపై సంతాప సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీటీసీ అవ నిగడ్డ సత్తిబాబులతో పాటు వార్డు మెంబర్లు రామకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.హిమబిందు, కూటమి శ్రేణులు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

అంబాజీపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నాగమల్లిచెట్టు వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలలో అమలాపురం డివిజన్ సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భగవాన్ సత్యసాయి శతజయంతి ఉత్సవాలలో భాగంగా సంస్థ కోఆర్డినేటర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో చెవి, దంతాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. 83 మంది విద్యార్థులకు ప్రభాకర్‌తోపాటు మురళీకృష్ణంరాజు వైద్యపరీక్షలు నిర్వహించారు. హెచ్ఎం వీఎస్ఎన్‌మూర్తి, సత్యసాయి సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే నా అజెండా

● ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజలకు సేవ చేయడమే తన అజెండా అని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం మలికిపురం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు ప్రజాప్రతినిధులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లు, కార్యదర్శులు పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు. కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు డంపింగ్ యార్డు స్థలాన్ని గుర్తించాలని అదేవిధంగా శ్మశానవాటికలు లేనిచోట్ల శ్మశానవాటికలను గుర్తించాలని ఆయన కోరారు. రోడ్లు, కాల్వల పక్కన ఆక్రమణలు లేకుండా చూడాలని ఆయన కోరారు. రాజోలులో గోదావరికి గ్రోయిన్స్ నిర్మాణానికి రూ.10.50 కోట్లు మంజూరు అవుతున్నాయన్నారు. ఉపాధి పథకంలో 3వేల పనులను రూ.33.50 కోట్లతో అంచనాలు తయారుచేసి ఆమోదానికి పంపామన్నారు. ఈ పనులన్నీ పూర్తయితే నియోజకవర్గం మోడల్‌గా మారుతుందన్నారు. శంకరగుప్తం డ్రెయిన్ డ్రెడ్జింగ్ మిగిలిపోయిన భాగాన్ని రూ.9.7 కోట్లతో పనులు చేయడానికి త్వరలో ఆమోదం రానుందని ఆయన చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా కలిసి పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. వేసవిలో తాగునీటికి, విద్యుత్‌కు ఇబ్బందులు లేకుండా ఇప్పటికే అన్నిచర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ఎంపీడీవో జి.సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ పి.శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, సర్పంచ్‌లు యెనుముల నాగు, చెల్లుబోయిన హెలీన, తోట పుష్పకుమారి, మందపాటి నాగేశ్వరరావు, గుర్తింక సత్తిబాబు, కాకర ఏను, ఆరేటి రంగ, కడలి దుర్గాదేవి, బోనం సీతామహాలక్ష్మి, నల్లి విజయకుమారి, గెడ్డం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మంగెన భూదేవి, ఎం.సాయిరామ్, ఎం.వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలన్నీ సస్యశ్యామలంగా ఉండాలి : ఎమ్మెల్యే దేవ

అంతర్వేది, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో ఉన్న ప్రతీ గ్రామం సస్యశ్యామలంగా ఉండాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే దేవ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ముందుగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అంశంపై ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే దేవ ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్‌ను అంతమొందించి పర్యావరణానికి విఘాతం కలగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాల్వలు, రెవెన్యూ, రైత్వారీ బోదెల్లో డ్రైన్లలో పూడికలుతీసి మట్టిని తరలించి పల్లంగా ఉన్న స్కూలు గ్రౌండ్లను మెరక చేయాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను క్లాప్‌మిత్రల సహాయంతో షెడ్డుకు చేర్చి రీసైక్లింగ్ కంపెనీకి అప్పగించాలన్నారు. వీటిని మండలపరిషత్‌లో తీర్మానం తీసుకుని వెంటనే వారం రోజుల్లో అమలుచేయాలని కార్యదర్శులు, సర్పంచ్‌లకు సూచించారు. ఆర్‌డబ్ల్యుఎస్, రోడ్లు, విద్యుత్, వైద్యం, విద్య, రెవెన్యూ, హౌసింగ్, వెలుగు, హార్టీకల్చర్, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై రివ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.సూర్యనారాయణ, తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు గొల్లమందల చిట్టిబాబు, పోతురాజు నరసింహారావు (కిశోర్), దెందుకూరి శ్రీహరిరాజు, ముప్పర్తి అలివేలు గంగాత్రివేణి, ముప్పర్తి నాని, కోఆప్షన్ సభ్యుడు బళ్ల నోబుల్, ఎంపీటీసీ బైరా నాగరాజు, బళ్ల సుభాషిణి, ఉండపల్లి సాయికుమారిఅంజి, నాని, వివిధ శాఖల అధికారులుత తదితరులు పాల్గొన్నారు.

కనీస గౌరవం కల్పించడంలేదని

ఎంపీటీసీల గైర్హాజరు

● మండల సర్వసభ్య సమావేశం రద్దు

మలికిపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరగాల్సి ఉండగా ఎంపీటీసీ సభ్యులు పార్టీలకు అతీతంగా గైర్హాజరయ్యారు. కేవలం ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. ఎంపీటీసీలకు కనీస గౌరవం కల్పించడంలేదని, గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు ఎవరూ ఆహ్వానించడంలేదని తదితర సమస్యలతో సమావేశానికి రాలేదు. ఎంపీపీ, మండల పరిషత్ అధికారులు, ఎన్డీఏ నాయకులు పలుమార్లు ఫోన్‌లో చర్చించినప్పటికీ ఎవరూ స్పందించలేదు. సమస్యలు ఏమైనా ఉంటే శాసనసభ్యుని దృష్టిలో పెట్టి పరిష్కరించుకుందామని నాయకులు తెలిపినప్పటికీ అందరూ మిన్నకుండిపోయారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సుమారు రెండు గంటల పాటు ఎంపీపీ గదిలో ఉండిపోయారు. ఎవరూ రాకపోవడంతో సర్వసభ్య సమావేశాన్ని రద్దుచేసి అధికారులు, సమావేశానికి హాజరైన సర్పంచ్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే స్పందించానని, వారిని చర్చలకు పిలిచానని, త్వరలో వారందరితో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరిస్తానని ఆయన అన్నారు.

బాలకృష్ణ ప్రసాద్ సంస్మరణ సభ

అమలాపురం టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విష్ణు సాన్నిధ్యం పొందిన తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సంస్మరణ సభను ఆర్ట్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అమలాపురం భూపయ్య అగ్రహారంలో తొలుత బాలకృష్ణప్రసాద్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆర్ట్ ఫ్యామిలీ అధ్యక్షురాలు తాతపూడి సౌమ్యలక్ష్మి మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలను జన బాహుళ్యంలోకి తీసుకురావడానికి బాలకృష్ణప్రసాద్ తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. అనంతరం అన్నమయ్య సంకీర్తనలు ఆలపించి ఆయనకు సంగీత నివాళి అర్పించారు. పేరి వాణి, ఆంధ్ర ఉషారాణి, పుత్సా కృష్ణకామేశ్వర్, గంటి వాణి, కొత్తూరి బాల, మూల బాల, లలిత, శ్రీపాద అన్నపూర్ణ, పేరి లీలావతి, పి.సుశీల, శ్రీనిత్య పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



ఎన్నెన్నో అందాలు..

ఆలమూరు వద్ద గోదావరిలో సాయంత్రం వేళ గోదావరికి బొట్టు పెట్టినట్టుగా అస్తమిస్తున్న దృశ్యం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. అటుగా వెళుతున్న ప్రకృతి ప్రేమికులు వీటిని వీక్షిస్తూ ఎన్నెన్నో అందాలు అంటూ పరవశించారు. (ఆలమూరు, ఆంధ్రజ్యోతి)





ఏడిదలో నిర్మించిన ఆలయంలో పునఃప్రతిష్ఠించిన కైలాసేశ్వరస్వామివారు. పక్క చిత్రంలో స్వామివారిని దర్శించుకునేందుకు వస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

ఏడిదలో ఘనంగా కైలాసేశ్వరస్వామి ప్రతిష్ఠ

మండపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఏడిద గ్రామంలోనున్న కైలాసేశ్వరస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ శనివారం వైభవంగా జరిగింది. ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో దేవాదాయ ధర్మాదాయశాఖ నిధుల తోపాటు, స్థానికుల విరాళాలతో ఆలయాన్ని పునఃనిర్మించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో ఐదు రోజుల నుంచి ఆలయం వద్ద పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. శనివారం ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరిపారు. గ్రామానికి చెందిన ముత్తారెడ్డి సుబ్రహ్మణ్య చౌదరి దంపతులు కూర్చుని ఆయా కార్యక్రమాలను జరిపారు. బాదంపూడి సత్యనారాయణ సారధ్యంలో వేద పండితులు ఆయా కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ పునః ప్రతిష్ఠలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్తలు నామాల పురుషోత్తం, బీఎస్ఆర్ సంస్థల అధినేత బలుసు శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, స్థానిక నేతలు సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

రైతు భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే సమక్షంలో విరాళం ఇస్తున్న దాత సతీష్

ఆలమూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ, చింతలూరు పంచాయతీ నిధులతో చింతలూరులో నిర్మించిన రైతు భవనాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శనివారం ప్రారంభించారు. రైతుల విశ్రాంతి భవనానికి ఓఎన్జీసీ నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఓఎన్జీసీ అధికారి శాంతన్‌దాస్‌జీ, ఆర్డీవో శ్రీకర్, ఎంపీడీవో రాజు, తహశీల్దార్ ప్రకాష్‌బాబు, ఆలయ ఈవో వీర్రాజు, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు. చింతలూరు నూకాంబిక ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆలమూరుకు చెందిన వ్యాపారవేత్త వట్టికూటి సతీష్ రూ.లక్ష విరాళాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతులమీదుగా ఈవో వీర్రాజుకు అందించారు. మోదుకూరుకు చెందిన రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు చుండ్రు శ్రీనివాస్ ఆలయంలో ఏసీ నిమిత్తం రూ.60 వేలు అందించారు. దాతలు సతీష్, శ్రీనివాస్, దాసరి బాబురావులను ఎమ్మెల్యే బండారు సత్కరించారు.

కేశవస్వామి ఆలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ పూజలు

ఆత్రేయపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం తమిళనాడు రాష్ట్రానికి చెందిన ప్రిన్సిపల్ సెక్రటరీ, షిప్పింగ్ కార్పొరేషన్ చైర్మన్ టీఎస్ వెంకటేష్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందించారు.



తమిళనాడు ప్రిన్సిపల్ సెక్రటరీకి స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం



నూకాంబిక ఉత్సవాలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారు

సమష్టి కృషితో జాతరను విజయవంతం చేయాలి

అధికారుల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే

ఆలమూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఉత్సవాలను సమష్టి కృషితో విజయవంతం చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. అమ్మవారి ఉత్సవాలు ఈనెల 28 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే బండారు, కొత్తపేట ఆర్డీవో శ్రీకర్‌ల సమక్షంలో సమీక్ష నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి చంటి పిల్లలతో వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. మంచినీరు, పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాలని, విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు నడిపించాలని ఎమ్మెల్యే బండారు అన్నారు. ముఖ్యంగా బందోబస్తు ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్‌ను కోరారు. సమావేశంలో దేవదాయశాఖ జిల్లా అధికారి, సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉత్సవ ప్రత్యేకాధికారి బాలాజీ రాంప్రసాద్, ఆలయ ఈవో వుండవల్లి వీర్రాజు, తహశీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, ఎంపీడీవో ఎ.రాజు, డీఎస్పీ సుంకర మురళీమోహన్, ఎస్ఐ ఎం.అశోక్‌తో పాటు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

రావులపాలెం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఖండవల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు ఆధ్వర్యంలో వాడపల్లి కమలనాథ్ అర్చకత్వంలో స్వామివారికి వేకువజామున సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, తిరుప్పావడ సేవ, శ్రీనివాస తులాభారం, రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. భక్తులు, గోవిందమాలధారులు ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వీటి ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ పడాల పెద వెంకటరెడ్డి పర్యవేక్షించారు.

పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కొత్తపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవోలు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి తెలిపారు. ఈ నెల 17 నుంచి జరిగే పరీక్షలలో మండలం నుంచి 911 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. మండలంలో ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, వారికి తాగునీరు, విద్యుత్ సౌకర్యాలతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. దూరప్రాంతాల విద్యార్థులకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌వీవీ శేఖర్ రావు, ఆర్.రాధాకృష్ణ, ఆర్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

రాయవరం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారంతో ముగిశాయి. కెమిస్ట్రీ పరీక్షలకు 114, కామర్స్ పరీక్షకు 26 మంది విద్యార్థులు హాజరుకాగా నలుగురు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ నాగేశ్వరరెడ్డి తెలిపారు.



రామచంద్రపురం మార్కెట్ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు



కె.గంగవరంలో డస్టుబిన్లు, కరపత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు తదితరులు



ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో డస్ట్‌బిన్‌లు అందిస్తున్న దృశ్యం



ఆలమూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రకు అధిక ప్రాధాన్యం

మండపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. నియోజకవర్గాన్ని ఆ దిశగా తీర్చిదిద్దటమే తమ లక్ష్యమన్నారు. శనివారం మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పరిసరాల శుభ్రత వల్లే ఆరోగ్యం సాధ్యమన్నారు. కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మున్సిపల్ అధికారులతో ఆయన మానవహారంలో పాల్గొని స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. మండపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకుమారి నేతృత్వంలో ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

రూరల్‌లో: మండపేట మండలంలోని ఆయా పంచాయతీల వద్ద కార్యదర్శులు, సర్పంచ్‌లు స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. మండపేట మండలం ఏడిద, ద్వారపూడి, కేశవరం, పాలతోడు, వెలగతోడు, ఇప్పనపాడు, తాపేశ్వరం, మారేడుబాక తదితర గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో పలువురు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రావులపాలెంలో అవగాహన ర్యాలీ

ప్లాస్టిక్ బ్యాగులు వద్దు

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం రామచంద్రపురంలో ప్లాస్టిక్ వాడకం నిషేధంపై ప్రచారం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు, కౌన్సిలర్లు రామచంద్రపురం మార్కెట్‌లో ప్లాస్టిక్ బ్యాగుల వాడకం నిషేధంపై అవగాహన కల్పించారు. మార్కెట్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, కౌన్సిలర్ అంకం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు దంగేటి గౌరీశంకర్, అల్లం శ్రీనివాస్, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మండపేటలో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

వ్యాపారులకు అవగాహన: ద్రాక్షారామ పంచాయతీ సర్పంచ్ కొత్తపల్లి అరుణ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై వ్యాపార సంస్థల యజమానులకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. బోసుబొమ్మ సెంటర్‌లో ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పెట్టా సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

చెత్తబుట్టల పంపిణీ

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం కె.గంగవరం మండలం కూళ్లలో పలు అంశాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సర్పంచ్ చిల్లి నాగేశ్వరరావు ఇంటింటికి తిరిగి కరపత్రాలు, డస్టుబిన్లు అందించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈవో పీఆర్‌అండ్‌ఆర్డీ కెఎస్ గౌరీకుమారి, మండల పరిషత్ పరిపాలన అధికారి టీవీ సురేంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ గోపిరామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. పర్యావరణానికి, పరిసరాల శుభ్రతకు అందరూ సహకరించాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సిరిగినేడి పట్టాభి, సీహెచ్ గణేష్, ఎన్టీఆర్ వైద్య మిత్ర ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించి ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని ఎంపీడీవో కె.రత్నకుమారి అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం మండలంలోని అంగరలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వద్దు, పర్యావరణాన్ని కాపాడుకుందాం నినాదంపై కార్యదర్శి ఈవో పీఆర్డీ ఆర్.మోహన్, వివిధ శాఖల సిబ్బందితో కలిసి ప్రజలకు, వ్యాపారస్తులకు, ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వివరించారు. తడిపొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. మండలంలోని మాచర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రమాదేవి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ప్లకార్డులు, కాగితం టోపీలు ధరించి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేసి ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణపై విద్యార్థులతో కలిసి ర్యాలీ జరిపారు. పాఠశాల పారిశుధ్య కార్మికురాలిని సన్మానించారు. కార్యక్రమాల్లో అంగర సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ యర్రా వీరన్నబాబు, మండల పరిషత్ ఏవో రాజేంద్రప్రసాద్, పాఠశాల హెచ్ఎం రాజు, పంచాయతీ, సచివాయల సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, యానిమేటర్లు, మాచర ఎస్ఎంసీ చైర్మన్ భీమేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): బొబ్బర్లంకలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలని కోరుతూ ర్యాలీ జరిపారు. సర్పంచ్ నరాలశెట్టి సుబ్బలక్ష్మి అధ్యక్షతన ఎంపీడీవో వెంకటరామన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎం, విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఇంటింటికీ డస్ట్‌బిన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సర్పంచ్ బూసి జయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం స్వర్ణంధ్రా-స్వచ్ఛాంధ్రను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తడి,పొడి చెత్త నిర్వహణపై అవగాహన కల్పించడంతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్‌కుమార్, నాయకులు మిద్దే ఆదినారాయణ, బూసి భాస్కరరావు, కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ఆయా ప్రాంతాల్లో అధికారులు అవగాహన ర్యాలీలు జరిపారు. రావులపాలెం మండలంలోని గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో సెక్రటరీలు సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ యు.రమేష్ బాబు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిపారు.



ఎమ్మెల్సీ సోము వీర్రాజును సత్కరిస్తున్న ఇళ్ల వెంకటేశ్వరరావు

ఎమ్మెల్సీ సోమును కలసిన ఇళ్ల

ద్రాక్షారామ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా రెండోసారి ఎన్నికైన బీజేపీ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సోము వీర్రాజును ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇళ్ల వెంకటేశ్వరరావు కలిశారు. రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన్ను పుష్పగుచ్ఛంతో సత్కరించారు.



ప్రత్యేక అలంకరణలో వెదురుపాక అయ్యప్పస్వామి పీఠం

అయ్యప్పస్వామికి జన్మనక్షత్ర పూజలు

రాయవరం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వెదురుపాక జనార్దనస్వామి ఆలయంలో ఉన్న అయ్యప్పస్వామి పీఠం వద్ద అయ్యప్పస్వామి జన్మ నక్షత్ర పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఫాల్గుణ మాసం ఉత్తర నక్షత్రాన్ని పురస్కరించుకుని పీఠం గురుస్వామి బండారు వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత అయ్యప్పస్వామికి అర్చనలు, హారతులు నిర్వహించారు. భక్తులతో భజనలు నిర్వహించి ప్రసాదం పంపిణీ చేశారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

రావులపాలెం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పొడగట్లపల్లిలోని ఉప్పలపాటి జానకీయమ్మ అన్నదాన సత్రంలో అవిడి సత్యం జ్ఞాపకార్థం అవిడి బాలనాగగణపతి - శ్రీవిద్య దంపతులు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ ట్రస్టు జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందచేశారు. వైద్య శిబిరాన్ని టీడీపీ యువ నాయకులు బండారు సంజీవ్, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ ప్రారంభించారు.

భక్తుల సౌకర్యాలకు అధిక ప్రాధాన్యం

వాడపల్లి ఆలయంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పర్యటన

ఆత్రేయపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శనివారం స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయంలో పర్యటించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో పాల్గొని వీధులను శుభ్రం చేశారు. స్వామివారి దర్శనం, అన్నప్రసాదం తదితర వివరాలను భక్తులను అడిగి తెలుసుకున్నారు. భక్తులతో కలిసి స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ ప్రాంతాల భక్తులు వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.90 కోట్ల ప్రసాదం స్కీమ్‌కు ప్రతిపాదనలు పంపించామన్నారు. క్యూలైన్లను విస్తరించి షామియానాలు, కూలర్లు, చంటిపిల్లలకు బిస్కెట్లు, మజ్జిగ ఏర్పాటు చేశామన్నారు. ఏడు ప్రదక్షిణల రద్దీ పెరిగిపోవడంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించి ఎక్స్‌వేటర్ల ద్వారా భక్తులను లోపల నుంచి బయటకు వెళ్లేలా ప్లానింగ్ రూపొందించామన్నారు. పార్కింగ్ సౌకర్యాలు, డార్మిటరీ, టాయిలెట్లు నిర్మిస్తున్నామన్నారు. ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావుతో కలిసి అభివృద్ధిపై సమీక్షించారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 567 మంది విద్యార్థులు

ఆత్రేయపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈవోలు వరప్రసాద్, సాహెబ్ తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుండి ఏప్రిల్ 1 వరకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆత్రేయపురం మండలంలో బాలురు 264, బాలికలు 303 కలిపి 567 మంది విద్యార్థులు పరీక్షలు హాజరవుతున్నారన్నారు.



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

స్వామివారి ఆదాయం రూ.1.72లక్షలు

కొత్తపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వ దర్శనాలు, తైలాభిషేకాలకు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది అన్ని చర్యలు తీసుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,72,446 ఒకరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

మత సామరస్యానికి ఇఫ్తార్ దోహదం

ద్రాక్షారామ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ఇఫ్తార్‌లు దోహదం చేస్తాయని మంత్రి సుభాష్ అన్నారు. శనివారం రాత్రి రామచంద్రపురంలో నవజావాబ్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్‌లో ముస్లింలతో కలసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ సీనియర్‌నేత వాసంశెట్టి సత్యం, మంత్రి సుభాష్‌లను వారు సత్కరించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.




మంత్రి సుభాష్‌ను సత్కరిస్తున్న ముస్లిం పెద్దలు



రాజకీయపార్టీల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అఖిల

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలపండి

ద్రాక్షారామ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలు, బీఎల్‌వోలు, ఏఈఆర్‌వో కార్యాలయాల్లో ఓటర్ల జాబితాలు ఉన్నాయని ఆర్డీవో అఖిల తెలిపారు. వాటిని తనిఖీ చేసుకుని ఏమైనా చేర్పులు, తొలగింపులు, సవరణల కొరకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీలకు పలు వివరాలు అందచేసి అభ్యంతరాలు ఉంటే బీఎల్‌వోలకు తెలియచేయాలని కోరారు. ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణలపై బీఎల్‌వోలు నిర్వహించే విచారణకు బూత్‌లెవెల్ ఏజెంట్లు హాజరుకావాలని సూచించారు. టీడీపీ, జనసేన, వైసీపీ ప్రతినిధులు పలు సూచనలు చేశారు.



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన నియోజకవర్గ పరిధిలోని గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో 22 వినతులు వచ్చాయని వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో ప్రస్తుతానికి కొన్ని అమలవుతున్నాయని మిగిలిన పథకాలు కూడా త్వరలో అమలుపరుస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.